RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి


2లో

కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఆగని పోరు


2లో

భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :55 | సోమవారం 24 నవంబర్ 2025 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in



- సత్య సాయిబాబా ఆశయాలను విస్తృతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధం
- ఘనంగా సాయిబాబా శతజయంతి ఉత్సవాలు
- ఉత్సవాలకు హాజరైన ప్రముఖులు

## దేవుడిగా సాయిబాబాకు
# శాశ్వత స్థానం



**మన సాక్షి, నవంబర్ 23, పుట్టపర్తి :**

భగవాన్ సత్య సాయిబాబా ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లో విస్తృతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాయిబాబా శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సాయిబాబా సేవలను గుర్తుచేసుకున్నారు. మానవ రూపంలోని దేవుడు సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం గొప్ప గౌరవంగా ప్రకటించారు. "సాయిబాబా మనుషుల్లో దేవుడిని చూశారు. ప్రేమతో మనుషులను గెలిచారు. సేవలతో దేవుడిగా కొలువబడుతున్నారు. మానవులను ప్రేమించాలి. ప్రేమ గొప్పది. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. సత్య సాయిబాబా మన మధ్యన లేకపోయినా వారిచ్చిన స్ఫూర్తి, భావన నిర్వాహకుల అందరిలో కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు కూడా చేయలేని సేవలను బాబా, వారి ట్రస్టు ద్వారా చేసి చూపించారు. ముఖ్యంగా ప్రతి వారూ చదువుకోవాలని ప్రభుత్వాలతో పోటీ పడి కేజీ టు పీజీ వరకు పేదలకు ఉచితంగా విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. విద్య, వైద్య, తాగునీటి సౌకర్యం కల్పించడంలో ఎంతో కృషి చేశారు. జీవితంలో చివరి దశలో మరణం తప్ప వేరే మార్గం లేదని అనుకున్న దశలో ఎంతో మందిని బతికించి దేవుడిగా కొలువబడుతున్నారు. పాలమూరు లాంటి వలస జిల్లాలు కరువు కాటకాలతో కునారిల్లుతున్న కాలంలో, ప్రభుత్వాలు సైతం తాగునీటి సౌకర్యాలు కల్పించలేని కాలంలో సొంత జిల్లా పాలమూరు దాహర్తిని తీర్చారు. అనంతపురం జిల్లాలో తాగునీటి సౌకర్యం కల్పించారు. తమిళనాడు రాష్ట్రంలో సైతం బాబా సేవలను విస్తృత పరిచి ఈనాడు అందరి మనసుల్లో దేవుడిగా శాశ్వత స్థానం సాధించారు. మానవ సేవ మాధవ సేవ బోధించడమే కాకుండా సంపూర్ణంగా నమ్మి విశ్వసించారు.

ఈనాడు 140 దేశాల్లో బాబా కి భక్తులు ఉండటమే కాకుండా వారంతా వివిధ మార్గాల్లో సేవలు అందిస్తున్నారు.

సాయి శతజయంతి ఉత్సవాల్లో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రులు, దాదాపు 40 నుంచి 50 దేశాలకు చెందిన ప్రముఖులు ఎంతో మంది హాజరయ్యారంటే వారి ప్రత్యేకతను గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. సత్య సాయిబాబా ఆలోచనలను, వారు అనుసరించిన విధానాలను ప్రజలకు చేరవేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది.." అని ముఖ్యమంత్రి చెప్పారు. పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో కార్యక్రమం తర్వాత ముఖ్యమంత్రి సాయి కుల్వంత్ హాలులోని సత్య సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు.


# రైతు భరోసాకు వేళాయే..!

**మన సాక్షి, నవంబర్ 23, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు పెట్టుబడి సహాయం అందజేసేందుకు అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అమలుకు యాసంగి సీజన్ కు గాను రైతులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి ఏడాదికి 12,000 రూపాయలను అందజేస్తున్న విషయం తెలిసిందే. కాగా వానాకాలం సీజన్ లో ఎకరానికి 6000 రూపాయల చొప్పున రైతుల ఖాతాలలో జమ చేశారు. యాసంగి సీజన్ ప్రారంభమైనందున ఎకరానికి మరో 6000 చొప్పున రైతుల ఖాతాలలో జమ చేస్తారనిఎదురుచూస్తున్నారు. యాసంగి పంటల సీజన్ ప్రారంభమైంది. ఓ పక్క వానాకాలం వంటనువిక్రయించుకుంటున్న రైతులు మరో పక్క యాసంగి సాగుకు కూడా సిద్ధమయ్యారు. వానాకాలం సీజన్ లో అధిక వర్షాల వల్ల రైతులు భారీ నష్టం చవిచూచారు. తుఫాన్ కారణంగా పంట చేతికొచ్చే ముందు నేలపాలైంది. దాంతో కనీసం పెట్టుబడులు కూడా వెళ్ళని పరిస్థితి నెలకొన్నది. రైతులు

అప్పుల పాలయ్యారు. ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. పంట దిగుబడి కూడా భారీగా తగ్గిపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. కాగా వానాకాలం సీజన్ కు ముందుగానే రైతు భరోసా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం యాసంగి సీజన్ లో కూడా పంటలు సాగు చేసుకోవడానికి ముందే ఇస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు. అదేవిదంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున ఎన్నికలకు ముందే రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందే రైతు భరోసా ఇస్తే రైతులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని కూడా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా రైతు భరోసా ఎప్పుడు ఇవ్వాలనే విషయంపై ఈనెల 25వ తేదీన క్యాబినెట్ సమావేశంలో కూడా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందు రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ అవుతాయా..? లేదా..? అనేది వేచి చూడాల్సి ఉంది.



# తెలంగాణలో ఏపీకే ఫైల్స్ అలజడి!..
## వందల వాట్సప్ గ్రూపులపై దాడి

హైదరాబాద్: రాష్ట్రంలో ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు అలజడి సృష్టిస్తున్నారు. 'ఆధార్‌తోపాటు ఇతర నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలు అప్‌డేట్ చేసుకోని కారణంగా ఈరోజు రాత్రి నుంచి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ చేస్తున్నాం. వెంటనే కింద ఉన్న లింకును క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేయండి' అని టీం ఎస్బీఐ పేరుతో ఆదివారం అనేక వాట్సప్ గ్రూపుల్లో సందేశాలు హోరెత్తాయి. ఎస్బీఐ ఖాతాలున్న చాలామంది బ్లాక్ అవుతుందన్న భయంతో లింకుపై క్లిక్ చేశారు. ఆ క్షణం నుంచే వారి ఫోన్లు నేరగాళ్ల అధీనంలోకి వెళ్లాయి. ఆ వెంటనే సదరు ఫోన్లో ఉన్న ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి ఈ సందేశాన్ని పంపారు. ఇలా గొలుసుకట్టుగా వేలాది ఫోన్లకు వెళ్లాయి. ఇందులో రాష్ట్ర మంత్రిత్వశాఖల అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసుకున్న గ్రూపులతోపాటు స్నేహితులు, విద్యార్థుల గ్రూపులు కూడా ఉన్నాయి. ఫోన్లలోని సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరడంతో అనేకమంది భయాందోళనకు గురవుతున్నారు. పలువురు స్థానిక పోలీసులతోపాటు 1930కి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. తక్షణం చేయాల్సిన చర్యలుపొరపాటుగా ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేసి ఉంటే వెంటనే కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

మొదట ఇంటర్‌నెట్ డేటా ఆఫ్ చేసి, సెట్టింగ్స్‌లోని యాప్స్‌లోకి వెళ్లి సదరు ఏపీకే యాప్‌ని అన్‌ఇన్‌స్టాల్ చేయాలి. యాంటీ వైరస్ యాప్‌తో ఫోన్‌ని ఫుల్‌స్కాన్ చేయాలి. బ్యాంకింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల ఎకౌంట్లు, ఈ-మెయిల్ ఎకౌంట్ పాస్‌వర్డులు వెంటనే మార్చాలి. మెసేజ్‌లు, కాల్‌లాగ్, బ్యాంకు లావాదేవీలు, ఈ-మెయిల్ లాగిన్లలో అనుమానాస్పద యాక్టివిటీ ఉందేమో పరిశీలించాలి. ఒకవేళ మాల్‌వేర్ యాప్ అన్‌ఇన్‌స్టాల్ అవ్వకపోతే, ఫోన్‌ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి అన్‌ఇన్‌స్టాల్ చేయాలి. ఫోన్లో ఇంకా అనుమానాస్పద యాక్టివిటీ కనిపిస్తే డేటా బ్యాకప్ తీసుకొని ఫ్యాక్టరీ రీసెట్ చేయడం మంచిది.

ఏదైనా మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే బ్యాంకు ఖాతా స్తంభింపజేయాలి. 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.




# టిమ్స్ ఆసుపత్రులు ఎప్పుడు పూర్తి చేస్తారు?: హరీశ్‌రావు

హైదరాబాద్: నెల రోజుల్లో టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని ప్రారంభిస్తామని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా సీఎం ప్రకటించి నెల దాటినా ఇప్పటికీ అతీగతీ లేదని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల పట్ల ప్రచార ఆర్భాటాలు తప్ప పురోగతి కనిపించడం లేదని భారత రాష్ట్ర సమితి మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులను ఎప్పుడు ప్రారంభిస్తారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. "ప్రభుత్వ భూములను అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్యసేవలు అందించడంపై లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే గానీ, ఆచరణ గడప దాడడం లేదనడానికి టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణమే నిదర్శనం. భారత రాష్ట్ర సమితి హయాంలో శరవేగంగా జరిగిన టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు.. కాంగ్రెస్ రాగానే నత్తనడకన సాగుతున్నాయి. ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందో అనే ఆలోచనలతో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే వాటి పనులను పూర్తి చేయడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# గ్లోబల్ సమిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు

అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్: భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు రానున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో నేరుగా రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట (బేగరికంచ)కు చేరుకున్న సీఎం... సదస్సు నిర్వహించనున్న స్థలానికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. సమిట్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అధికారులతో అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో పలు దేశాలకు చెందిన అంబాసిడర్లు, ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. సదస్సుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. ఎంట్రీ పాసులు లేకుండా.. సమిట్‌తో సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ప్రాంగణంలోకి రావడానికి వీల్లేదు.



శాఖలవారీగా నిర్దేశించిన అధికారులకు ప్రవేశం ఉండాలి. పార్కింగ్‌కు పక్కా ప్రణాళిక రూపొందించాలి. బందోబస్తులో పాల్గొనే పోలీసులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి' అని అధికారులను ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని చెప్పారు. పనుల పురోగతి, ఇతర అంశాలను ఆయనకు అధికారులు వివరించారు. అనంతరం సమీపంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయం పనుల పురోగతిని సీఎం పరిశీలించారు. ఆయన వెంట ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అడిషనల్ సీఈవో ఈవీ నరసింహారెడ్డి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్నారు. నేడు సీజేఐ ప్రమాణ స్వీకారానికి సీఎం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో.. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. అనంతరం హైదరాబాద్ తిరిగొచ్చి సోమవారం మధ్యాహ్నం కొడంగల్ నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు.



# కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఆగని పోరు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ కోసం మొదలైన పోరు మరిన్ని రోజులు కొనసాగేలా కనిపిస్తోంది. మిగిలిన రెండున్నరేళ్ల నాయకత్వం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు పట్టుబట్టగా అధిష్ఠానం జోక్యం అనివార్యమైంది. శుక్రవారమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు చేరుకున్నారు. శనివారం రాత్రి ముఖ్యమంత్రితో, ఆదివారం పలువురు మంత్రులతో ఆయన చర్చించారు. చివరకు ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వలేకపోయారు. తన నివాసం వద్దకు వచ్చిన మీడియా ప్రతినిధులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'మీకు చెప్పేందుకు నా వద్ద ఏ విషయమూ లేదు. మూడు రోజులుగా నా ఇంటి వద్ద పడిగాపులు పడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు బాధ అనిపించింది. పార్టీలోనూ ఇలాంటి పరిణామాలు మంచివి కాదు. ఎలాంటి సమస్యలున్నా అధిష్ఠానం పరిష్కరిస్తుంది' అని చెప్పారు. బెంగళూరులో మూడు రోజులున్నా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన మద్దతుదారులెవరూ మల్లికార్జున ఖర్గేతో భేటీ కాకపోవడం గమనార్హం. అయితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మద్దతుదారులు, మంత్రులు హెచ్.సి.మహదేవప్ప, కె.వెంకటేశ్, ఈశ్వర ఖండ్రే తదితరులంతా ఖర్గేతో చర్చించారు.

**తెరపైకి దళిత సీఎం?**

గత నాలుగైదు రోజులుగా సిద్ధరామయ్య, శివకుమార్ మధ్యే నాయకత్వ పోరు కనిపించినా.. ఆదివారం అనూహ్యంగా సీనియర్ నేతలు తెరపైకి వచ్చారు. వీరంతా ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు కావడం విశేషం. అనివార్యంగా సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పించాల్సి వస్తే ఆ అవకాశాన్ని ఈసారి ఎస్సీలకు ఇవ్వాలన్న డిమాండ్ వినిపించింది. ఆదివారం హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ తానూ సీఎం రేసులో ఉన్నానని ప్రకటించారు. '2013లో నా నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లి గెలుపొందాం. కానీ నేను ఆ ఎన్నికల్లో ఓడిపోయాను. గెలిచి ఉంటే ఏమయ్యేదో? కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడికి (అప్పటికి పీసీసీ అధ్యక్షుడు ఈయనే) సీఎంగా అవకాశమిచ్చే సంప్రదాయం ఉంది. అలాగని అన్నిసార్లూ ఈ అవకాశాలు రావు. ఎన్నికలు అనగానే పార్టీలో అందరి కృషీ ఉంటుంది. ఒక్కరి వల్లే విజయం సాధించడం ఉండదు' అని వ్యాఖ్యానించారు.

తద్వారా తన వల్లే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందంటూ డీకే శివకుమార్ నిత్యం చేస్తున్న వాదనను పరమేశ్వర్ తోసిపుచ్చే ప్రయత్నం చేశారు. మరోవైపు మంత్రి మహదేవప్ప కూడా మల్లికార్జున ఖర్గేతో చర్చల సందర్భంగా దళితులకు అవకాశమిచ్చే విషయం గురించే ప్రతిపాదించినట్లు సమాచారం. ఖర్గే, పరమేశ్వర్, మహదేవప్ప.. ముగ్గురూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. గిరిజన సముదాయానికి చెందిన మంత్రి సతీశ్ జారి?హొళి కూడా ఇదే తరహా డిమాండ్ చేస్తున్నారు. రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఒప్పందం కుదిరితే ఆ అవకాశం అగ్రవర్ణాలకు కాకుండా కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న అహింద (అల్ప సంఖ్యాక, బీసీ, దళిత)లకు ఇవ్వాలన్న డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అహింద నేతగా ఇదే సముదాయాలకు చెందిన వారికి అవకాశం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామం ముఖ్యమంత్రి కావాలన్న శివకుమార్ ఆశలకు గండికొట్టవచ్చన్న మాట వినిపిస్తోంది.

# కాసులు కురిపించిన స్టాక్ ఇదే.. 10 వేలకు రూ. 6 లక్షల లాభం..

స్టాక్ మార్కెట్లలో దీర్ఘకాలంలో మంచి రిటర్న్లు ఇచ్చే స్టాక్స్ చాలానే ఉంటాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ఆర్థిక నిపుణుల సలహా తీసుకొని పెట్టుబడులు పెడితే మంచి లాభాలు అందుకోవచ్చు. ఇక మల్టీబ్యాగర్ స్టాక్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తాయి. అలాంటి ఒక మల్టీబ్యాగర్ స్టాక్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రూ. 10 వేల పెట్టుబడిని రూ. 6 లక్షలుగా మలిచింది. మీరు పెట్టుబడులు చేస్తున్నారా? దీని కోసం స్టాక్ మార్కెట్‌ను ఎంచుకుంటున్నారా? దలాల్ స్ట్రీట్‌లో ఇన్వెస్టర్ల సంపదను ఊహించని రీతిలో పెంచిన ఎన్నో స్టాక్స్ ఉన్నాయి. సరైన సమయంలో సరైన స్టాక్ ఎంచుకొని ఇన్వెస్ట్ చేస్తేనే లాంగ్ టర్మ్‌లో మంచి లాభాలు అందుకోవచ్చు. ఆర్థిక నిపుణుల దగ్గర నుంచి సలహాలు తీసుకొని పెట్టుబడులు పెడితేనే రిస్క్ లేకుండా రిటర్న్లు పొందే అవకాశం ఉంటుంది. కొన్ని స్టాక్స్ ఇటీవల కొంతకాలంగా పనితీరు బాగాలేకపోయినా లాంగ్ టర్మ్‌లో మాత్రం అద్భుతమైన రిటర్న్లు ఇచ్చిన షేర్లు ఎన్నో మనం గమనించొచ్చు. అలాంటి ఒక 500 స్టాక్ గురించి చూద్దాం. దీంట్లో చిన్న మొత్తంలో



పెట్టుబడి లక్షలుగా మారింది. అదే గ్లాస్‌కోట్ లిమిటెడ్. వివిధ పరిశ్రమల కోసం ఈ కంపెనీ గ్లాస్ లైన్డ్ ఎక్విప్‌మెంట్ సహా ఫిల్టర్లు, డ్రైయర్లు వంటి వాటి తయారీలో నిమగ్నమై ఉంది. గత పదేళ్లలో ఈ స్టాక్ ఏకంగా 6 వేల శాతం రిటర్న్లు ఇచ్చింది. ఈ క్రమంలో రూ. లక్ష పెట్టుబడిని ఈ షేరు రూ. 60 లక్షలు చేసింది. అదే రూ. 10 వేల పెట్టుబడితో కూడా రూ. 6 లక్షల రిటర్న్లు రావడం విశేషం అని చెప్పొచ్చు. ఈ షేరు కొంతకాలంగా మాత్రం నెగెటివ్‌లో ట్రేడవుతోంది. మార్కెట్లో ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ. 441.45 వద్ద ఉండగా.. నెల వ్యవధిలో 14 శాతం తగ్గింది. 6 నెలల్లో 25 శాతం పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు చూసినట్లయితే 17 శాతానికిపైగా దిగొచ్చింది. ఏడాది కాలంలో కూడా 15 శాతం పతనమైంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 3.01 వేల కోట్లుగా ఉంది. 52 వారాల గరిష్ట ధర రూ. 698.40 కాగా.. కనిష్ట ధర రూ. 436.80 వద్ద ఉంది. ఆగ్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్, డైస్, పిగ్మెంట్స్, ఏపీఐ, ఫార్మాష్యూటికల్ ఇండస్ట్రీస్ వంటి రంగాల్లో ఈ కంపెనీ కస్టమర్లు ఉన్నారు. ఇక షేర్‌హోల్డింగ్ ప్యాటర్న్ ప్రకారం ఎక్స్ఛేంజీల్లో ఉన్న సమాచారం మేరకు ప్రమోటర్ల దగ్గరే అత్యధికంగా 67 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డర్ల వద్ద మిగతా 33 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డర్లలో మ్యూచువల్ ఫండ్ల వాటా 3.9 శాతం కాగా.. ఫారెన్ ఇన్వెస్టర్ల వాటా 4 శాతంగా ఉంది. ఇక 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 11 శాతం పెరిగి రూ. 239 కోట్లుగా నమోదైంది. ఇక నికర లాభం 12 శాతం ఎగబాకి రూ. 28.7 కోట్లకు చేరింది. ప్రస్తుతానికి ఈ స్టాక్ టార్గెట్ ప్రైస్‌ను బ్రోకరేజీ సంస్థలు పెంచుతున్నాయి.

# స్పెషల్ స్కీమ్ తెచ్చిన బ్యాంక్.. వారికి అత్యధికంగా 9 శాతం వడ్డీ..



**అధిక ద్రవ్యోల్బణం నుంచి తప్పించుకు నేందుకు, ఆర్థిక మాంద్యం దరిచేరకుండా చూసేందుకు రెపో రేటును 4 శాతం నుంచి ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో చాలా బ్యాంకులు కూడా లోన్ వడ్డీ రేట్లు పెంచి ఇదే సమయంలో డిపాజిట్లపైనే అధిక వడ్డీ ఆఫర్ చేశాయి. ఇంకొన్ని బ్యాంకులు కస్టమర్లను ఆకర్షించేందుకు లిమిటెడ్ పీరియడ్ ఆఫర్ కింద అధిక వడ్డీ రేటుతో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని కూడా ప్రారంభిం చాయి. ఇక ఇప్పుడు ప్రముఖ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఒకటి స్పెషల్ ఎఫ్‌డీ తీసుకొచ్చింది. దీని వివరాలు చూద్దాం. ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు పై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తాయి.**

కొంతకాలంగా చాలా బ్యాంకులు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు ఎక్కువ వడ్డీ అందిస్తుంటే.. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఇంకా ఎక్కువ వడ్డీనే ఆఫర్ చేస్తుండటం గమనించొచ్చు. ఇప్పుడు ఒక స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్పెషల్ డిపాజిట్ తీసుకురాగా.. దీనిపైనే అధిక వడ్డీ వస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 మార్చి నుంచి 2023 మే వరకు దాదాపు సంవత్సర కాలంలోనే రెపో రేట్లను భారీగా పెంచుకుంటూ పోయింది. అధిక ద్రవ్యోల్బణం నుంచి తప్పించుకు నేందుకు, ఆర్థిక మాంద్యం దరిచేరకుండా చూసేందుకు రెపో రేటును 4 శాతం నుంచి ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో చాలా బ్యాంకులు కూడా లోన్ వడ్డీ రేట్లు పెంచి ఇదే సమయంలో డిపాజిట్లపైనే అధిక వడ్డీ ఆఫర్ చేశాయి. ఇంకొన్ని బ్యాంకులు కస్టమర్లను ఆకర్షించేందుకు లిమిటెడ్ పీరియడ్ ఆఫర్ కింద అధిక వడ్డీ రేటుతో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని కూడా ప్రారంభిం చాయి. ఇక ఇప్పుడు ప్రముఖ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఒకటి స్పెషల్ ఎఫ్‌డీ తీసుకొచ్చింది. దీని వివరాలు చూద్దాం. ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు పై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తాయి. ఇంకా స్పెషల్ స్కీమ్స్‌పై అంతకుమించి వడ్డీ పొందొచ్చు. మరోవైపు సాధారణ ప్రజలతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు ఎక్కువ వడ్డీ వస్తుంది. చాలా బ్యాంకుల్లో ఇది వారితో పోలిస్తే 50 బేసిస్ పాయింట్లు ఎక్కువే ఉంటుంది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 15 నెలల కాలపరిమితితో ఒక ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై రెగ్యులర్ సిటిజెన్లకు అత్యధికంగా 8.50 శాతం వడ్డీ అందిస్తుండగా.. అదే సీనియర్ సిటిజెన్లకు అయితే మరో 50 బేసిస్ పాయింట్లు ఎక్కువ చేసి 9 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ మేరకు బ్యాంక్ తాజాగా అధికారిక ప్రకటనలో వెల్లడించింది. రూ. 2 కోట్ల లోపు డిపాజిట్లపై ఇది వర్తిస్తుంది. స్వల్పకాలంలో డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఆశించే వారి కోసం ఈ స్కీమ్ తీసుకొచ్చినట్లు బ్యాంక్ స్పష్టం చేసింది.

**రూ. లక్ష డిపాజిట్ చేస్తే..**

ఇక 15 నెలల వ్యవధిపై రూ. లక్ష డిపాజిట్ చేస్తే రెగ్యులర్ సిటిజెన్లకు 8.50 శాతం వడ్డీ రేటు ప్రకారం రూ. 10,253 వడ్డీ పొందుతారు. మొతం చేతికి 15 నెలల్లో రూ. 1,10,253 వస్తుంది. ఇదే సీనియర్ సిటిజెన్ల విషయానికి వస్తే.. 9 శాతం వడ్డీ ప్రకారం 15 నెలల్లో రూ. లక్ష డిపాజిట్‌పై రూ.10,853 వడ్డీ అందుతుంది. చేతికి మొత్తం రూ. 1,10,853 వస్తుంది.ప్లాటినా డిపాజిట్‌పై సీనియర్ సిటిజెన్లకు 9.20 శాతం వడ్డీ కింద రూ. 11,093 వడ్డీ వస్తుంది. 15 నెలల్లోనే లక్ష డిపాజిట్‌ను రూ. 1,11,093 చేసింది.

# భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి

**అవి ఎంతమాత్రం ఐచ్ఛికం కావు**

**ఐబీఎస్‌ఏ నేతల సమావేశంలో మోదీ స్పష్టీకరణ**

**అందరికీ అందుబాటులో నూతన సాంకేతికతలు..**

**జీ20 సదస్సులో భారత ప్రధాని**



జొహన్నెస్‌బర్గ్: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావడం ఇక ఎంతమాత్రం ఐచ్ఛికం (ఆప్షన్) కాదని, అది తప్పనిసరి అని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. కృత్రిమ మేధ సహా అధునాతన సాంకేతికతలు, నవ్యావిష్కరణలు ఆయా దేశాలకే పరిమితం కావడం సబబుకాదని.. అవి ప్రపంచ మానవాళికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో చర్చలు జరిపారు. భారత్– బ్రెజిల్– దక్షిణాఫ్రికా (ఐబీఎస్‌ఏ) నేతల శిఖరాగ్ర సదస్సునుద్దేశించి మాట్లాడారు. ఈ మూడింటిలో వివిధ అంశాలను ప్రస్తావించారు. మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడానికి జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఏ) స్థాయి సమావేశాన్ని వ్యవస్థాగతం చేయాలని చెప్పారు.

**మనది హృదయపూర్వక బంధం**

"ఉగ్రవాదంపై పోరాటంలో సమన్వయంతో ముందుకు సాగాలి. దీనిలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు. మనిషి కేంద్రంగా జరిగే అభివృద్ధిలో సాంకేతికతకు కీలక పాత్ర ఉంది. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా మధ్య యూపీఐ, కొవిన్ వంటి సాంకేతిక చొరవలను, సైబర్ భద్రతను పంచుకోవడానికి ఏర్పాటు చేయాలి. వాతావరణ మార్పుల్ని తట్టుకుని నిలిచే వ్యవసాయానికి కూడా ఐబీఎస్‌ఏ సహాయ హస్తం అందించాలి. ఐబీఎస్‌ఏ అనేది కేవలం మూడు దేశాల కూటమి కాదు.. మూడు ఖండాలను కలుపుతున్న ముఖ్యమైన వేదిక. ప్రజలు కేంద్రంగా నిలిచేలా విశ్వసనీయ, సురక్షిత ఏఐ నిబంధనల రూపకల్పనకు ఈ కూటమి తనవంతు చేయూత అందించగలదు. దక్షిణార్ధగోళ దేశాల గొంతును, ఆకాంక్షల్ని బలోపేతం చేయడానికి మనం హృదయపూర్వకంగా కట్టుబడి ఉన్నాం" అని మోదీ చెప్పారు. ఏఐ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, డీప్‌ఫేక్, ఉగ్రచర్యలకు దానిని వాడుకోవడాన్ని నిలువరించాలని పిలుపునిచ్చారు. ఏఐని నేటి ఉద్యోగాలుగా కాకుండా రేపటి సామర్థ్యాలుగా చూడాలన్నారు.

**దేశాధినేతలతో చర్చలు**

జపాన్ ప్రధాని సనాయె తకాయిచి, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, జమైకా ప్రధాని ఆండ్రూ హెల్నెస్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కోఫ్‌లతో మోదీ చర్చలు జరిపారు. రక్షణ రంగంలో సహకార విస్తృతి గురించి కార్నేతో చర్చించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. భారత్‌కు రావాల్సిందిగా ఆహ్వానించినట్లు చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలీనా జార్జీవాతోనూ ఆయన సమావేశమయ్యారు. ఆదివారం రాత్రి దిల్లీకి బయల్దేరారు.

జొహన్నెస్‌బర్గ్‌లో ఐబీఎస్‌ఏ నేతల సమావేశం సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాలతో ప్రధాని మోదీ

**పగ్గాలు తీసుకోని అమెరికా**

జీ20 తదుపరి సారథ్య పగ్గాలను అమెరికాకు అప్పగించాల్సి ఉండగా ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో తాము భాగం పంచుకోవడం లేదని ముందుగానే చెప్పేసి, గైర్హాజరయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా 'అంతర్జాతీయ సంబంధాలు–సహకార శాఖ' కార్యాలయానికి సోమవారం లాంఛనంగా ఈ బాధ్యతల్ని అప్పగించనున్నారు.

**ఇంత కష్టమంటే మేం పారిపోయేవాళ్లం!**

భారత్– దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆహార భద్రత, ఏఐ వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై మోదీ–రమఫోసా చర్చించారు. అంకుర పరిశ్రమల్లో పెట్టుబడులను సులభతరం చేసేందుకు ఇరువురు అంగీకారానికి వచ్చారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు రమఫోసాకు మోదీ అభినందనలు తెలిపారు. సదస్సు నిర్వహణ ఇంత కష్టమని మోదీ చెప్పిఉంటే తాము బహుశా పారిపోయి ఉండేవాళ్లమని రమఫోసా చమత్కరించారు. దాంతో అక్కడున్నవారంతా నవ్వుల్లో మునిగిపోయారు. "జీ20 నిర్వహణ గురించి మీ నుంచి మేమెంతో నేర్చుకున్నాం. గతంలో మీకు అవకాశం వచ్చినప్పుడు (దిల్లీలో) ఎంతో భారీగా చేశారు. మేం చిన్నగా సరిపెట్టాం" అని చెప్పారు. 'చిన్నదే ఎప్పుడూ అందంగా ఉంటుంది' అని మోదీ బదులిచ్చారు.

# ఇన్వెస్టర్లను నిండా ముంచిన రిలయన్స్, ఎస్‌బీఐ షేర్లు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కిందటి వారం భారీ నష్టాల్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. భారీ కరెక్షన్‌కు గురయ్యాయి. స్మా క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్స్ ధరలు భారీగా పెరగడం అనుమానాలకు తావిస్తుందని సెబీ ఛైర్‌పర్సన్ స్వయంగా చెప్పడం సహా ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. దీంతో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. రిలయన్స్, ఎస్బీఐ, ఎల్ఐసీ వంటివాటి వాటానే దీంట్లో ఎక్కువ. స్టాక్ మార్కెట్లలో చాలా వరకు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల ధరలు ఇటీవలి కాలంలో బుడగల్లా పెరుగుతూ వస్తున్నాయని.. ఇది అసలే సహేతుకంగా అనిపించట్లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్ కొద్దిరోజుల కింద మాట్లాడారు. దీంతో స్టాక్ మార్కెట్లు గత వారం కరెక్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు అంతకుముందు స్టాక్ మార్కెట్ సూచీలు రికార్డు గరిష్టాలకు చేరిన క్రమంలోనే ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) పాల్పడ్డారు. దీంతో పలు హెవీవెయిట్ షేర్లు కిందటి వారం భారీగా పతనమయ్యాయి. ఒక్క వారం వ్యవధిలోనే ఇన్వెస్టర్లకు భారీ నష్టం వాటిల్లింది. మార్కెట్ విలువ పరంగా భారత్‌లోని టాప్ 10 కంపెనీల్లో 5 కంపెనీల మార్కెట్ విలువనే ఏకంగా రూ. 2.23 లక్షల కోట్లు పతనమైంది. వీటిల్లో ఎక్కువగా భారత అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్కువగా నష్టపోయింది. ఆ తర్వాత ప్రభుత్వ సంస్థలైన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నాయి. కిందటి వారం బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 1.99 శాతం లేదా 1475.96 పాయింట్లు పడిపోయింది. టాప్–10 కంపెనీల్లో నష్టపోయిన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా హిందుస్థాన్ యూనిలీవర్ ఉన్నాయి. ఇదే సమయంలో మార్కెట్లు పతనమైనా.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఐటీసీ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రమే అత్యధికంగా వారం వ్యవధిలో రూ. 81,763.35 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. అంటే ఇన్వెస్టర్లు దీంట్లో పెట్టుబడులు పెట్టి ఇంత మొత్తం నష్టపోయారన్నమాట. ప్రస్తుతం ఎంక్యాప్ రూ. 19.19 లక్షల కోట్లకు చేరింది.

**రిలయన్స్, ఎస్బీఐ, ఎల్ఐసీ వంటివాటి వాటానే దీంట్లో ఎక్కువ. స్టాక్ మార్కెట్లలో చాలా వరకు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల ధరలు ఇటీవలి కాలంలో బుడగల్లా పెరుగుతూ వస్తున్నాయని.. ఇది అసలే సహేతుకంగా అనిపించట్లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్ కొద్దిరోజుల కింద మాట్లాడారు.**

ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. 63 వేల కోట్లు తగ్గి.. రూ. 5.84 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక ఎస్‌బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 50 వేల కోట్లు పతనమై ప్రస్తుతం రూ. 6.53 లక్షల కోట్లకు చేరింది. హిందుస్థాన్ యూనీలివర్ రూ. 21 వేల కోట్లు పడిపోయి రూ. 5.46 లక్షల కోట్లకు వచ్చింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 6 వేల కోట్లు తగ్గి రూ. 7.57 కోట్లకు చేరింది. వీటికి భిన్నంగా టీసీఎస్ మార్కెట్ విలువ రూ. 38 వేల కోట్లు పెరిగి రూ. 15.25 లక్షల కోట్లకు ఎంక్యాప్ చేరింది. భారతీ ఎయిర్‌టెల్ ఎం–క్యాప్ రూ. 11 వేల కోట్లు ఎగబాకి రూ. 6.89 లక్షల కోట్లకు చేరింది. ఐటీసీ మార్కెట్ విలువ రూ. 7 వేల కోట్లు పెరిగి రూ. 5.23 లక్షల కోట్లకు చేరింది. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 4 వేల కోట్లు ఎగబాకి రూ. 11.03 లక్షల కోట్లకు చేరింది.

# కాలం గర్భంలోకి మావోయిస్ట్ పార్టీ !

మావోయిస్టుల చరిత్ర ముగిసినట్లుగానే భావించాలి. ఉవ్వెత్తున ఎగిసిన పీపుల్స్‌వార్ ఇప్పుడు గతచరిత్రగా మిగిలిపోయింది. ప్రజలతో సంబంధాలు, ప్రజల సమస్యలపై పోరాటం ఉన్నంత వరకు వారు బలంగా ఉన్నారు. ప్రజల అండదండ ఉన్నంత వరకు ఉద్యమం బలంగా సాగింది. కానీ కేవలం అడవికే పరిమితమై, ప్రజలకు దూరమైన నేపథ్యంలో వారికి అండదండలు కరువయ్యాయి. కొండపల్లి సీతారామయ్య మొదలు, గణపతి వరకు పీపుల్స్‌వార్ ఉండగా బలమైన విప్లవపార్టీగా వెలుగొందింది. అలాగే గ్రామస్థాయిలో ప్రజల మనన్ననలు పొందింది. ప్రజల సమస్యలపై నిలదీసేలా ఉద్యమాన్ని నిర్మించింది. రాజకీయ నాయకులు గ్రామాలకు వెళ్లాలంటేనే భయపడేలా చేసింది. భూకమందులు పారిపోయి పట్టణాలకు చేరారు. రైతులకు అండగా నిలిచారు. మొత్తంగా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడం, వారికి మేం అండగా ఉన్నామని చెప్పడం ద్వారా బలమైన విప్లవపార్టీగా నిలిచింది. కానీ ప్రజలతో దూరం అయినందున క్రమంగా పార్టీ బలహీనపడుతూ వచ్చింది. అంతెందుకు మావోయిస్ట్ పార్టీగా మారిన తరవాతనే దాని పతనం ప్రారంభమయ్యింది. గ్రామాల్లో మొదలు పట్టణాల్లో కూడా మావోలు దందాలు మొదలు పెట్టారు. కేవలం దందాలు చేసి బెదరించుకునే బ్యాచ్‌గా మారింది. పట్టణాల్లో మావో అగ్రనేతల విలాసాలు బయట పడ్డాయి. పోలీసులకు దొరికిపోయారు. కొందరు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలా ఆ పార్టీలో కల్చర్ మారింది. ప్రజల పక్షాన పోరాడాలన్న లక్ష్యం పోయింది. దీనికితోడు ప్రపంచం మారుతోంది. అడవుల్లో ఉండి పోరాడేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరు. ఎవరికి వారు తమ కెరీర్ కోసం చదువులను కొనసాగించారు. ఒకప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారు పీపుల్స్‌వార్‌కు ఆకర్శితులయ్యారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.

సిద్దాంతాలకు ఆకర్శితమై పోరాడే వారు లేరు. ప్రజలు ఏదో పనిచేసుకుని బతికేందుకే సిద్దంగా ఉన్నారు. విదేశీ విద్య అందుబాటులోకి రావడంతో యువత విదేశాల బాట పట్టింది. ఇలా రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. ఉన్నవారు అడవులకు పరిమితం అయ్యారు. అలాగే పోలీస్ నిర్బంధం వల్ల పార్టీ విస్తరణ అన్నది లేకుండా పోయింది. మొత్తంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్‌గా ఉన్న పార్టీ క్రమేణా ప్రాభవం కోల్పోయి మావోయిస్ట్ పార్టీగా మరింత పతనం అయ్యింది. అగ్రనేతల దూరదృష్టి లోపం, విభేదాలు, లొంగుబాట్లు ఇలా అంతా కలసి నిర్వీర్యం అయ్యింది. దీనికితోడు పోలీస్ నిర్బంధం పెరిగింది. గతంలో కూడా నిర్బంధం ఉన్నా ప్రజలు తమ కడుపులో పెట్టుకుని దాచుకున్నారు. ఇకపోతే నమ్ముకున్న గిరిజనులను ఇన్‌ఫార్మర్ల పేరుతో మట్టుపెట్టారు. కిరాతక హత్యలకు పాల్పడ్డారు. గొడ్డలితో నరికి వేయడం,కాళ్లూ చేతులు నరకడం వంటి కిరాతక చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు ఎంతగా హింసకు పాల్పడ్డారో అంతకు మించి అన్నట్లుగా నక్సల్స్ హింససాగింది. వారి పతనావస్థకు ఇవన్నీ కారణాలుగానే చూడాలి. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్‌తో అగ్రనేతలంతా మట్టికరిచినట్లే. కొందరు లొంగిపోయారు. మరికొందరు నేలకొరిగారు. ఇటీవల మల్లోజుల తదితర అగ్రనేతలు లొంగిపోవడం కూడా ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించు కునేందుకే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఇన్నేళ్ల సుదీర్ఘ పోరాటంలో మావోయిస్టులు సాధించిందేమీ లేదు. వేలాదిమందిని వారు పొట్టన పెట్టుకున్నారు. అలాగే వేలాదిమంది మావోలు కూడా మృత్యువాత పడ్డారు. చివరకు ఉద్యమపార్టీ సాధించింది సున్నా అనే చెప్పాలి. మారేడిమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు చనిపోయిన క్రమంలో ప్రతి ఒక్కరూ అవలోకన చేసుకోవాలి. అడవుల బాట పట్టిన మావోల కారణంగా ఎందరో జీవితాలు నాశనం అయ్యాయి. ఎందరో తమ వృత్తిని, చదువును వదిలి పోరాటంలో దూకడంతో కుటుంబాలను రోడ్డున పడేశారు. వందలాదిమంది తల్లిదండ్రులకు గర్భశోకం

మిగిల్చారు. తాజాగా మారేడిమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్ కౌంటర్‌లో తప్పించుకున్న ఆరుగురు కూడా హతమయ్యారని అధికారులు వెల్లడించారు.

# నిద్రవ్యవస్థలో సీసీ కెమెరాలు...

## తరచూ దొంగతనాలు

**తుంగతుర్తి,నవంబర్ 12, మన సాక్షి:**



తుంగతుర్తి మండల పరిధిలోని మెయిన్ రోడ్డు పై గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రతి మెయిన్ వీధిలో సీసీ కెమెరాలు అమర్చి వాటిని పర్యవేక్షణలో ఉంచారు అవి అరకొర పరిస్థితిలతో గ్రామములో ఒక 85 సీసీ కెమెరాలు మెయిన్ బజార్లలో విద్యుత్తు స్తంభాలకు అమర్చారు ఒక సంవత్సరం వాటిని పోలి శాఖ వారు అన్ని హంగులతో ఆనాటి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ సహకారంతో కొన్ని నిధులను పెట్టి వాటిని గ్రామంలో మెయిన్ రోడ్లపై పెట్టారు ఆ తదుపరి మా గ్రామ పంచాయతీ సర్పంచ్ కొన్ని నిధులతో కొన్నింటిని అమర్చారు ఆ సీసీ ఫుటేజ్ లను పోలీస్ స్టేషన్లో పెట్టారు కానీ ఒక సంవత్సరం నుండి అవి నిద్రావస్థలో ఉన్నాయని తెలిసినప్పటికీ అజాగ్రత్తతో పోలీసు అధికారులు మండల అధికారులు నిద్రావస్థలో పరిపాలన సాగిస్తున్నారు.

గత సంవత్సరంలో పోలీస్ శాఖను ఇదేమిటని కొంతమంది గ్రామ పెద్దలు సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అడగడంతో ఈ మధ్య కాలంలోనే జిల్లా అధికారులకు తెలియపరిచాము త్వరలోనే సీసీ కెమెరాలు బాగు చేయించి వాటిని పరిగణలోకి తెస్తామన్నారు కానీ అడిగినప్పుడల్లా అదే సాగుతో పోలీస్ శాఖ తెలుపుతుంది ఇలా అయితే మా గ్రామాన్ని దొంగల బారి నుండి ఎలా రక్షిస్తారు సారు అని గ్రామస్తుల మొర గత రెండు సంవత్సరాల క్రితం తుంగతుర్తి మండల పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలో ఒకేరోజు ఏడు ఇండ్లను దోచుకున్నారు అయినప్పటికీ దొంగలు దొరకలేదు ఆనాటి నుండి ఈరోజు వరకు రెండు సంవత్సరాలు కావస్తున్న చిన్న చిన్న దొంగతనాలు మా గ్రామంలో కూడా జరిగినప్పటికీ ఎవరు దొంగలు అని పోలీసులు నిర్ధారణ చేయలేదు కేసులు పెట్టలేదు ఇలా గ్రామంలో మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు చలికి రోజు వ్యవసాయ క్షేత్రాల వద్ద వారి పనులను ముగించుకొని చీకటి కాగానే చలికి గజగజ వణుకుతూ ప్రజలు ఇండ్లలో పండుకుంటున్నారు.

ఇంటి ముందట ద్విచక్ర వాహనాలు ఒకపక్క బర్రె దూడలు మరోపక్క గొర్రెలు మేకలు వారి ఇంటి చుట్టూ వారికి అవసరం ఉన్న వస్తువులు వారి వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన యంత్రాలు ఉంటున్నాయి ఈ మధ్యకాలంలో వేరే జిల్లాల నుండి ఆకతాయిలు దొంగతనాలు ద్విచక్ర వాహనాలను ఎత్తుకు వెళ్తున్నారు మరోపక్క ట్రాక్టర్ బ్యాటరీలను టైర్లను కూడా దొంగతనం చేస్తున్నారని రైతులు మొరపెట్టుకుంటున్నారు ఇకపోతే బావుల వద్ద మోటార్లు కూడా దొంగలించినట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు ఇలా మండలంలోని పలు గ్రామాల ప్రజలు సీసీ కెమెరాలు బాగు చేయించి మనుగడలో తేవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి ఈ సీసీ కెమెరాలు మెయింటెనెన్స్ ఖర్చులను పెట్టి బాగు చేయించాలని కోరుతున్నారు ఇకపోతే గ్రామాలలోని గ్రామ పంచాయతీల నిధుల ద్వారా సీసీ కెమెరాలను పెట్టి గ్రామాలను రక్షించుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# సత్యసాయి బాబా సేవలను ఎల్లప్పుడు స్మరించుకోవాలి

## మనత్వానికి మారుపేరు సత్యసాయి బాబా

## ఘనంగా సత్య సాయి బాబా జన్మదిన వేడుకలు

**నారాయణపేట టౌన్,నవంబర్ 23,మన సాక్షి :**



మానవత్వానికి మారుపేరుగా సత్య సాయి బాబా నిలిచారని ఆయన సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ అన్నారు. ఆదివారం సత్య సాయిబాబా జయంతి సందర్భంగా శత జయంతి ఉత్సవాలను ఆదివారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ లో అధికారికంగా నిర్వహించారు. ప్రజావాణి హాల్లో భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటానికి ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. సాయిబాబా చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఏర్పడిన నీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రత్యేక పంపులను ఏర్పాటు చేసి తాగు నీటిని అందించిన మహనీయుడన్నారు. ప్రభుత్వం ఎలాగైతే ఉచిత పథకాలను అందిస్తుందో అలాగే భగవాన్ సత్య సాయిబాబా ట్రస్ట్ ద్వారా ఉచితంగా విద్య వైద్యం ఇతర సేవ కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీధర్, డి వై ఎస్ ఓ వెంకటేష్ , శివరాజ్, విజయ్ కుమార్ కనిగిరి, మాజీ కౌన్సిలర్ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

# 28న గీతన్నల రణభేరి విజయవంతం చేయాలి

**కేతేపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**



కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా నవంబర్ 28వ తేదీన సూర్యాపేటలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుండి గీత కార్మికులు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. కేతేపల్లి మండలంలో కొండకిదిగూడెం, బండ పాలెం గ్రామాలలో బహిరంగ సభ పోస్టర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ అనంతరం 29,30 తేదీలలో జరిగే ప్రతినిధుల మహాసభలో రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా పెట్టలేని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు, ఎక్స్గ్రేషియా 10 లక్షలకు పెంచాలని, ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్గ్రేషియా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ సతీష్, నర్సింగ్ నాగయ్య, చౌగోని నాగయ్య, పోగుల నాగయ్య, నారాయణ, పుట్ట సతీష్, పెద్ది నాగయ్య, పెద్ది శ్రీను, నక్కల జానయ్య, చౌగోని సైదులు, చంద్రయ్య, నక్కల అనంతం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో ఆందోలుకు అవకాశం





**అందోలు, నవంబర్ 23, మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రెటైర్డ్ ఉద్యోగుల సంఘం సంగారెడ్డి జిల్లా శాఖకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినవి. అందులో సహాయ కార్యదర్శిగా అందోలు మండలానికి చెందిన పి నవీన్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం రాంరెడ్డి ఎన్నికైనారు. వారికి అందోల్ మండల్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బి ప్రేమ్ కుమార్, యం మనోహర్ ప్రసాద్ కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ గౌడ్,రాజయ్య, శ్రీమతి గాయత్రి, సదశివ గౌడ్, వీరేశం, సత్య నారాయణ, పాండురంగం, అంజయ్య మరియు హీరాలాల్ అభినందనలు తెలియజేసినారు.

# ఓపెన్ డిగ్రీ కౌన్సెలింగ్ తరగతులు ప్రారంభం

**అందోలు, నవంబర్ 23, మన సాక్షి:**




జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నడపబడుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లోని అభ్యాసక అధ్యయన కేంద్రం -180 లో 2025-26 విద్యా సంవత్సరంలో 1/3/5 సెమిస్టర్లకు సంబంధించి కౌన్సిలింగ్ తరగతులు ప్రారంభం చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ సంవత్సరం అడ్మిషన్ తీసుకున్నటువంటి విద్యార్థినీ విద్యార్థులు ద్వితీయ, తృతీయ సంవత్సరంలో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ జి. పండరి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ జి. పండరి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి తరగతుల నిర్వహణ, ప్రయోగ తరగతుల నిర్వహణ, చదువుపై అవగాహనను విద్యార్థులకు కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోధన చేస్తున్నటువంటి కౌన్సిలర్లు,ఓపెన్ డిగ్రీ అధ్యాపకేతర బృందం పాల్గొనడం జరిగింది.

# యమధర్మరాజు రూపంలో మత్తు పదార్థాలపై అవగాహన

**తుంగతుర్తి,నవంబర్ 23, మన సాక్షి:**




తుంగతుర్తి మండలం కొత్తగూడెం టోల్గేట్ దగ్గర గంజాయి డ్రగ్స్ కు వ్యతిరేకంగా యమధర్మరాజు రూపంలో రాచకొండ ప్రభాకర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా యువత గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ అమూల్యమైన జీవితాన్ని కోల్పోతున్నారు అలాగే ఏమి తెలియని అమాయకులను కూడా ప్రమాదాల రూపంలో బలి తీసుకుంటున్నారు మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు తీసుకోవద్దని నోడ్రగ్స్ సేవ్ లైఫ్ అని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. రోడ్డు ప్రమాదాలు హత్యలు అత్యాచారాలకు ప్రధాన కారణం మత్తు పదార్థాలను సేవించడమే కాబట్టి ప్రభాకర్ యముడు రూపంలో యమలోకం నుండి భూలోకంలోకి వచ్చి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర వ్యక్తంగా గంజాయి డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు, సందేశాలతో కరపత్రాలు పంచుతూ.. మైక్ సెట్ ద్వారా ఫ్లెక్స్ ల ద్వారా అవగాహన కార్యక్రమ లు చేపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అతనితోపాటు పలువురు పలు గ్రామాల ప్రజలు చెక్పోస్ట్ వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

# లారీ డ్రైవర్లకు మద్దతు



**ఊర్కొండ, నవంబర్ 23,మన సాక్షి:**

నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండ జిన్నింగ్ మిల్లు ఊర్కొండ స్థానికులు లారీ ఓనర్లకు ఉపాధి అవకాశము ఇవ్వాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానికులకు అవకాశం ఇవ్వకపోతే ధర్నాలు చేపడతామని. మిల్లు యాజమాన్యాన్ని.కాంటాక్ట్ ను. సిసి అధికారులను హెచ్చరించారు. ఊర్కొండ మండల కేంద్రంలోని ప్రతి ఒక్క డ్రైవర్ లారీ ఓనర్లను డ్రైవర్లను లారీలకు ఉపాధి అవకాశం కల్పియాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టిఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు. ఉరుకొండ పేట ప్రజలు యువకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో తిడితేనే పదవులు

**నల్లగొండ,నవంబర్ 23, మన సాక్షి:**



కాంగ్రెస్ పార్టీలో తిడితేనే పదవులు వస్తాయని అలాగే ముఖ్యమంత్రి అనుచరుడైతేనే పదవులు వస్తాయని సీనియారిటీ జాంతానై అని డిసిసి పదవి కోసం ఎన్నో ఆశలు పెట్టుకొని పదవి రాకపోవడంతో నిరాశ చెందిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్ష పదవి మునుగోడుకు చెందిన పున్న కైలాస్ నేతకు ఇవ్వడంతో ఆయన ఒక్కింత ఆవేదనతో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో పార్టీని ముందుండి నడిపించాన ని కాంగ్రెస్ పార్టీ అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశానని ఆర్థికంగా నష్టపోయిన కూడా పార్టీ కోసం నిరంతరం జండా మోసి పనిచేశానన్నారు. నల్లగొండలో అప్పటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తలపెట్టిన సభను బట్టి విక్రమార్క పాదయాత్రను విజయవంతం చేశామని తెలిపారు. తనకు పదవి రాకపోవడం కి ప్రధాన కారణం తన కులం,తాను తిట్టకపోవడం, ముఖ్యమంత్రి అనుచరుని కాకపోవడమే అన్నారు, తమ గురువు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తలుచుకుంటే తనకు రాత్రికి రాత్రే రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ పదవి వస్తుందని అన్నారు. ప్రస్తుత డిసిసి అధ్యక్షుడు కైలాస్ నేత టిఆర్ఎస్ పార్టీ నుంచి వలస వచ్చిన వారిని వెంటబెట్టుకొని వారికి ప్రాధాన్యత ఇస్తే తాము చూస్తూ ఊరుకోమని అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని రాబోయే స్థానిక సంస్థలఎన్నికలలో పార్టీ విజయానికి పనిచేస్తామన్నారు. నూతన డిసిసి అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కోసం కార్యకర్తలు అంతా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి

## నిత్యం భయం గుప్పిట్లో ప్రయాణికులు

**గుర్రంపోడు, నవంబర్ 23, మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామం, బల్సకుంట వద్ద రోడ్డుకు కేవలం రెండు అడుగుల దూరంలో 30 అడుగుల లోతులో ప్రమాదకరంగా ఉన్న ఒక బావి స్థానికులను, ప్రయాణికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఈ మార్గంలో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో పాఠశాల బస్సులు, ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్లు విరివిగా తిరుగుతుంటాయి. ముఖ్యంగా, హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఉదయం 6 గంటలకు 9 గంటలకు, తిరిగి సాయంత్రం 3 గంటలకు మరియు 6 గంటలకు ఈ దారి గుండానే ప్రయాణిస్తాయి. వందలాది మంది ప్రయాణికులు విద్యార్థులు రాకపోకలు సాగించే ఈ కీలకమైన మార్గంలో, ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేని ఈ బావి పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ, స్థానిక పంచాయతీ అధికారులు లేదా రోడ్లు భవనాల శాఖ అధికారులు ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బావి చుట్టూ కనీసం హెచ్చరిక బోర్డులు లేదా రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని స్థానికులు మండిపడుతున్నారు. మానవ ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ బావి వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టి, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఉన్నతాధికారులను, ప్రజా ప్రతినిధులను గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# 4కే రన్ విజయవంతం చేయాలి

**నారాయణపేట టౌన్, నవంబర్ 23, మన సాక్షి :**



నారాయణపేట జిల్లా కేంద్రం లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నేడు సోమవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సర్దార్ ఏ150 యూనిటీ ఫర్ 4కే రన్ లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దోకూర్ తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఉదయం9.30 గంటలకు పట్టణంలోని బారం బావి దగ్గర నుండి ప్రారంభం అయ్యి సత్యనారాయణ కూడలి మీదుగా క్రీడా మైదానం లో ముగుస్తుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఆతిథితులుగా పాలమూరు ఎంపి.డికె.అరుణ, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ,జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ పాల్గొంటారనీ తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ యంత్రాంగం, పాఠశాల కళాశాల విద్యార్థులు జిల్లా లోని యువకులు మేధావులు వివిధ పార్టీల నాయకులు పేద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# కంగ్టి మండలంలో వార్డుల రిజర్వేషన్లు ఇవే

**కంగ్టి, నవంబర్ 23, మన సాక్షి :**




సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపిడివో సత్తయ్య ఎంపీపీ సమావేశం మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలకు సంబంధించి 280 వార్డ్ సభ్యుల రిజర్వేషన్లు ఖరారు. ఎస్టి 59,మహిళలు19, జనరల్ 40, ఎస్సీ 51 మహిళలు 20, జనరల్ 31, బీసీ 53 , మహిళలు 20 , జనరల్ 33, అన్ రిజర్వుడ్ 127 , మహిళలు 60, జనరల్ 67 జిల్లా అధికారులు ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో లాటరీ పద్ధతిన వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రక్రియ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ లక్ష్మణ్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్య సాయిబాబా శతజయంతి వేడుకలు

**రామసముద్రం,నవంబర్ 23,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని సత్యసాయి బాబా ఆశ్రమంలో ఆల్ ఇండియా ట్రస్ట్ బోర్డు సభ్యురాలు సావిత్రిదేవి శ్రీ హరన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగానిర్వహించారు. బాబా శతజయంతి పురస్కరించుకుని బాబా చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఆల్ ఇండియా సత్యసాయి ట్రస్ట్ సభ్యురాలు సావిత్రి శ్రీహరన్ కు దిన్నిపల్లె గ్రామస్థులు డప్పులు వాయిద్యాలతో గణస్వాగతం పలికారు ఆమెకు మహిళలు హారతులు పట్టి పుష్పాలు చల్లుతూ గ్రామంలో బానాసంచాలు కాలుస్తూ ఆమె చేతులు మీదుగా భారీ కేక్ కట్ చేసి స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జయంతి వేడుకల్లో పాల్గొన్నా భక్తులకు అన్నదానం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యురాలు సావిత్రిదేవి శ్రీహరన్ మాట్లాడుతూ మండలంలో సాయిభాబా ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులు విద్యా బోధన తో పాటు వసతులు కల్పిస్తూన్నామని, వృద్ధులకు నెలకి, రెండు నెలలఒకసారి నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు.శ్రీ సత్య సాయి బాబా కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా అన్ని మతాలను సమానంగా చూసే దైవిక దృష్టికోణాన్ని బోధించిన మహనీయులని ఎవరిని బాధ పెట్టొద్దు అందరికీ సహాయం చేయండి అనే మానవతా సందేశంతో చివరి శ్వాస వరకు సేవా విలువలను ఆచరణలో పెట్టిన ఉదాత్త వ్యక్తిత్వం ఆయనది. పుట్టపర్తిలో అంతర్జాతీయ ధ్యాన కేంద్రాన్ని స్థాపించి, ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించిన శ్రీ సత్య సాయి బాబా దేశంలోని అనేక రాష్ట్రాలు మరియు విదేశాల్లో ఆశ్రమాలు, సేవా సంస్థలు స్థాపించి ప్రేమ, శాంతి, సత్యం, ధర్మం, అహింస మార్గాలను ప్రబోధించారు.ఈకార్యక్రమంలో సావిత్రి దేవి శ్రీహరన్, మదనపల్లి రవి,తిలక్, కుమార్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**పెన్ పహాడ్,నవంబర్ 23,మన సాక్షి:**

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల సైదిరెడ్డి తో కలిసి పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళల కు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. వారి ఆర్థిక ప్రగతితో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతో పథకాలకు రూపకల్పన చేస్తున్నారన్నారు కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గజ్జల సైదిరెడ్డి.మాజీ సర్పంచ్ షేక్ జానిమియా.సంఘ బంధం అధ్యక్షురాలు షేక్ అలిమా మల్సూర్ , పంచాయతీ కార్యదర్శి సోమయ్య.సింగిల్ విండో వైస్ చెర్మెన్ మామిడి శ్రీనివాస్ పరశురాం విబికె లు షేక్ ఆశ .మామిడి వెంకట రమణ.ఉపేందర్ రెడ్డి.హనుమంత రెడ్డి.కె రాజు.శేఖర్.తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



**నల్లగొండ,నవంబర్ 23, మన సాక్షి.**

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగులకు టిఆర్ఎస్ మహిళా నాయకురాలు నర్ర నిర్మల నలగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి లు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేద కుటుంబాల విద్యార్థులను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి అభినవ అంబేద్కర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారికి ఎప్పుడూ ప్రజల ఆశీస్సులు ఉండాలని అందరూ ప్రార్థించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దేవేందర్. వందలాది మంది స్వేరోస్ మరియు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభిమానులు, అనుముల సురేష్ పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలి

**కేతేపల్లి,నవంబర్ 23,మన సాక్షి.**



కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్ లను అమలు చేయకుండా వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమల్ల సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతం లో కార్మికులకు ఉన్న కనీస హక్కులు లేకుండా ఈ లేబర్ కోడ్ లో నిబంధనలు పొందు పరిచారని అన్నారు. ఈ చట్టాలు అమలు జరిగితే కార్మికునికి యాజమాన్యాలపై ఎలాంటి నిరసన కార్యక్రమం చేయడానికి కూడా అవకాశం ఉండదని, ఉద్యోగ భద్రత ఉండదని, కనీస వేతనం రాదని, పని ప్రదేశాల్లో కనీస వసతులు కోరే అవకాశం కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం తన ఇష్టాను సారం గా ఆక్షలు విధిస్తారు కర్మికుని బతుకులు ఛిద్రం అవుతాయి తన హక్కులు అడిగే అవకాశం ఉండదని, కనీస కార్మికునిగా గుర్తింపు కూడా ఉండని స్థితికి చేరుకుంటారని, అందుకే ఈ లేబర్ కోడ్ లను అమలు చేయకుండా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేయని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని, ప్రభుత్వాలు తమ నిర్ణయం మార్చుకొనే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఉద్యోగులకు పి.ఆర్.సి అమలు చేయాలి

**మిర్యాలగూడ,నవంబర్ 23,మన సాక్షి:**



గడువు దాటి రెండు సంవత్సరాలు గడిచినందున వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 1 జులై 2023 నుండి పీఆర్సీ అమలు చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆదివారం మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పదవీవిరమణ అనంతర ప్రయోజనాలను,అన్ని రకాల పెండింగ్ బిల్లులను,డి ఏ లను వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు.సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు.నియామకం అపుడు లేని రూల్స్ ఇపుడు ఎందుకు అని ప్రశ్నించారు.రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందని,ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఊరి బడిని కాపాడుకోవాల్సిన అవసరం సమాజానికి ఉందన్నారు అన్ని పాఠశాలలలో.ప్రాథమిక ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని,తరగతి కొక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కర్నె ఆనంద్ కుమార్, నాయకులు అంబటి శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు

# బీసీ జేఏసి ఆధ్వర్యంలో 46 జీవో ప్రతుల దగ్ధం

**నల్లగొండ,నవంబర్ 23, మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే సర్పంచి ఎన్నికలలో బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు పరిమితి 50 శాతం మించకూడదనీ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు ఆదివారం జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 46 జీవో ప్రతులని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిసి యూత్, విద్యార్థి జేఏసీ చైర్మన్లు కట్టెకోలు దీపెందర్, అయితగోని జనార్ధన్ గౌడ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ బిజెపిల మోసం ఫలితమే జీవో నెంబర్ 46 విడుదల అయిందని తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతం ఉన్న,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9ని మొన్నటికి మొన్న విడుదల చేసిందనీ, ఇప్పుడు తొమ్మిది జీవోను రద్దు చేసి 46 జీవో తీసుకొచ్చి బీసీల రాజకీయ అణిచవేతకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.జీవో నెంబర్ 46ను తక్షణమే రద్దు చేయాలని, జీవో నెంబర్ 9 మాత్రమే అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ చైర్మన్, పుట్ట వెంకన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్ యాదవ్, కన్వీనర్ కర్నాటి యాదగిరి, వైస్ ఛైర్మన్లు మార్గం సతీష్, వడ్డేబోయిన రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయ్, చెన్నోజు రాజు, ప్రధాన కార్యదర్శి అంబటి శివ, చిరబోయిన వెంకటేశ్వర్లు రామస్వామి, గడ్డం మారయ్య, పగిళ్ళ సైదులు, కొత్తకొండ రమేష్, ఏల్లుట్ల సైదులు, పులిపాటి జీవన్, మెడిగ నాగరాజు, చిలువేరు యోగానందం, మాంద్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పెరికకుల సమగ్ర సర్వే చేపడతాం..!

**నల్లగొండ,నవంబర్ 23,మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్రంలో పెరికకుల సమగ్ర సర్వే చేపడతామని పెరికకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఘటిక విజయ్ కుమార్ తెలిపారు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన పెరిక కుల సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు పెరిక కులానికి అన్ని రంగాలలో వెబ్సైట్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. పెరిక కుల బ్యాంకును త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశానంతరం పెరిక కుల సంక్షేమ సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించారు .జిల్లా అధ్యక్షులుగా ఇత్తినేని శ్యామ్ సుందర్ ,ప్రధాన కార్యదర్శిగా కొనకంచి వీర రాఘవులు ,ఆర్థిక కార్యదర్శిగా వలి శెట్టి పరశురాములు ,ప్రసార కార్యదర్శిగా అంగిరేకుల నాగభూషణం .అసోసియేట్ అధ్యక్షులుగా అంగిరేకుల గోవర్ధన్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపడతామన్నారు .ఈ సమావేశంలో దాసరి మల్లేశం, కోకాపేట చైర్మన్ సుందరి వీర భాస్కర్,ఖైరతాబాద్ హాస్టల్ అధ్యక్షులు డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు ,రాష్ట్ర అసోసైటీ అధ్యక్షులు సుంకరి ఆనంద్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ బుదే వెంకటేశ్వర్లు ,సుందరి నాగయ్య , ఇండ్ల మల్లయ్య, ఎర్రం శెట్టి ఉపేందర్ ,నెమ్మని కాంతారావు ,ఎగ్గడి సుజాత , సుందరి రమాదేవి ,వలిశెట్టి స్వప్న తదితరులు హాజరైనారు.

# ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**మిర్యాలగూడ, నవంబర్ 23, మన సాక్షి:**

స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిలిపివేయాలని బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు గాదగోని మహేష్ గౌడ్ కోరారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు వెళ్లాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిన పార్టీగా మిగిలిపోతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సీనియర్ నాయకులు బసవయ్య, రామ లింగయ్య,జయరాజ్, నాగేశ్వర రావు, శ్రీనివాస్,సైదులు, మురళి, శంకర్, ఉన్నారు.

# టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

**ఖమ్మం, నవంబర్ 23,మన సాక్షి:**




ఖమ్మం ప్రస్తుతం ఇన్ సర్వీస్ లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు 2010వ సంవత్సరం కంటే ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధరావత్ రాములు రాష్ట్ర ప్రభుత్వమును కోరారు . ఈ సందర్భంగా టీఎన్జీవో భవనంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా టిఆర్టిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ సర్వీస్ లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు సర్వీస్ లో కొనసాగాలన్న , ప్రమోషన్ పొందాలన్నా , ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ క్వాలిఫై కావాలనడం అసమంజసమని వపోయారు . గతంలో నిర్వహించిన డీఎస్సీ నోటిఫికేషన్లలో సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులకు టెట్ ప్రస్తావన లేదని 20,30 సంవత్సరములు సర్వీస్ కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ క్వాలిఫై కావాలనడం సమాజసం కాదని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ( ఎన్ సి టి ఈ ) నిబంధనలను మార్చి సీనియర్ ఉపాధ్యాయులకు ఉప శమనం కలిగించాలని కోరారు . ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది . ఖమ్మం జిల్లా అధ్యక్షులు మట్టా శ్రీనివాసరావు , జిల్లా ప్రధాన కార్యదర్శిగా సింగారపు వేణు , అసోసియేట్ అధ్యక్షులుగా బి వీరేంద్ర , ఉపాధ్యక్షులు బి. రమేష్ , ఎన్ వెంకటేశ్వర్లు , బి జాన్ , కార్యదర్శులుగా మందుల బిక్షం , డి శ్రీనివాస్ , జి నరసింహారావు , ఎండి ఇర్ఫాన్ , రాష్ట్ర కౌన్సిలర్స్ గా ధరావత్ రాములు , బానోత్ బాలాజీ , జమ్ముల వెంకటేశ్వర్లు , జినక శ్రీనివాస్ తదితరులను ఎన్నికచేయడం జరిగింది . ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యులు మట్టా శ్రీనివాసరావు , సింగారపు వేణు , గట్టిగుండ్ల దుర్గయ్య , కర్నె సంపత్ కుమార్ , బి వీరేంద్ర , మందుల బిక్షం , సుంచు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు .

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**చింతపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ ఆదివారం వెలుగు కార్యాలయం ముందు డి ఆర్ డి ఏ పి డి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సుజాతలు మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారిత లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ ప్రగతి అనే నినాదంతో ఆడబిడ్డలకు చీర,సారె,పెట్టడం తెలంగాణ సాంప్రదాయమని మహిళలు అనే రంగాలలో అభివృద్ధి చెందితేనే రాష్ట్ర ప్రగతి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, డిపిఎం వీరయ్య, ఏపీఎం నరసింహ, సీసీ రమేష్, నరసింహ గౌడ్, వివో ఏ మేఘమాల, మహిళా సంఘ సభ్యులు వెలుగు సిబ్బంది తదితరుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 26న రాజ్యాంగ దినోత్సవం జయప్రదం చేయాలి



**కంగ్టి, నవంబర్ 23, మన సాక్షి :**

26న నారాయణఖేడ్ పట్టణంలో సాయిబాబా ఫంక్షన్ హాల్ లో భారత రాజ్యాంగ దినోత్సవం ( సవిదాన్ దివస్ ) రాజ్యాంగం పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డివిజన్ మాల మహానాడు జనరల్ సెక్రటరీ మారుతి అన్నారు. ఆదివారం కంగ్టి మండల తడ్కల్ గ్రామంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అంబేద్కర్ వాదులు,అంబేద్కర్ యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ,బహుజన ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యాంగ రక్షణదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు రేంజర్ల రాజేష్, తెలంగాణ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ హాజరవుతున్నట్టు తెలిపారు. కావున ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కంగ్టి మండల మాల మహానాడు అధ్యక్షుడు సాయిలు, సహాయ కార్యదర్శి జైపాల్, తడ్కల్ అధ్యక్షులు భూమన్న, శ్రీపతి, సంజు, వివిధ గ్రామాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు తదితరులు ఉన్నారు.

# సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాలు జయప్రదం చేయాలి

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**

**గోదావరిఖని టౌన్,నవంబర్ 23, మన సాక్షి:**



సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు .ఆదివారం స్థానిక భాస్కర్ రావు భవన్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి), అర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక కుటుంబాల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మావోయిస్టులు ఆయుదాలను వదిలి జనజీవన స్రవంతి లోకి వచ్చి కమ్యూనిస్టుల పునరికరణకు కృషి చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఆపరేషన్ కగారు పేరుతో వందలాది మందిని చంపుతున్న సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించడం లేదని అన్నారు. దేశంలో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల అభ్యున్నతికి వంద సంవత్సరాలుగా పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు.సింగరేణిలో 1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ని ఏర్పాటు చేసి అనేక కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటాలు నిర్వహించిందని అన్నారు.

శేషగిరిరావు,మఖ్దూం మోహియోద్దీన్ , సర్వదేవబట్ల రామనాథం, నల్లమల్ల గిరి ప్రసాద్, మనుబోతుల కొమరయ్య, విఠల్ రావు లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధులు యూనియన్ ను స్థాపించి కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని, కామ్రేడ్ భాస్కరరావు, కత్తుల కొమురయ్య, చంద దుర్గయ్య, పి. నరసయ్య, వి.టి. అబ్రహం లాంటి కార్మిక నాయకులు ప్రాణ త్యాగం చేశారని, త్యాగాల చరిత్ర కలిగిన యూనియన్ ఎఐటియుసి తప్ప మరొకటి లేదని ఆయన తెలిపారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు ఎఐటియుసి మాత్రమే సాధించిందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలకు దేశ వ్యాప్తంగానే కాకుండా 42 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎగిరే జండా ఎర్ర జెండా మాత్రమేనని సుదీర్ఘ త్యాగాలు కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో మడ్డి ఎల్లయ్య గౌడ్,యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్ ప్రకాష్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, కన్నం లక్ష్మి నారాయణ, కందుకూరి రాజారత్నం, మోటపలుకుల రమేశ్, రంగు శ్రీను, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, విజయలక్ష్మి, ప్రీతం, సూర్య, ఎం.ఎ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి నూతన విగ్రహ పున ప్రతిష్ఠ

**వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు**



**భీంగల్, నవంబర్ 23,మన సాక్షి:**



భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామంలో ఈనెల 21నుండి 23 వరకు ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభావంగా నిర్వహించామని ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. పెదంగంటి ఎల్లమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపనకు ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేసారని తెలియజేశారు.. శ్రీశ్రీశ్రీ గురుమంచి వేదపండితులు చంద్రశేఖర శర్మ, రాకేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఆదివారం రోజున గ్రామం నుండి మహిళలు మంగలహారతులు బోనాలతో ఎల్లమ్మ ఆలయం వరకు పాతదయాత్రగా వెల్లి ఎల్లమ్మ తల్లికి బెల్లం అన్నం,బూరెలు సమర్పించారు. వేద పండితులు ఎల్లమ్మ తల్లి విగ్రహనికి పూజలు నిర్వహించి ఎల్లమ్మ తల్లి విగ్రహన్ని పునః ప్రతిష్ట చేసారు. ఈ కార్యక్రమనికి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎల్లమ్మ భక్తులు భారీగా తరలివచారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారుఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదం స్వీకరించి దేవస్థానం కమిటీ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విగ్రహా దాతలు: శ్రీ లక్కడి జగన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి బ్రదర్స్, సహాయ సహకారం అందించారు.

## నూతన డీసీసీ అధ్యక్షుడు డా.వంశీ కృష్ణకు ఘన సన్మానం



**వెల్దండ నవంబర్ 23,మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తాజాగా ప్రకటించిన జిల్లా కమిటీ అధ్యక్షులలో భాగంగా నాగర్ కర్నూలు జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మూడోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ.. నన్ను విశ్వసించి ఈ బాధ్యత ఇచ్చిన పార్టీ హై కమాండ్ కు, నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, బుక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చొక్కాయ్యా గుట్ట పై మొక్కలు నాటిన యోగ సభ్యులు

**భీంగల్,నవంబర్ 23,మన సాక్షి:**



బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ పట్టణ కేంద్రంలోని ఆదివారం యోగ సభ్యుల ఆధ్వర్యంలో చొక్కయ్య గుట్ట పై గిరిప్రదక్షిణ, మొక్కలు నాటడం కార్యక్రమం చేశారు.. యోగ సభ్యులు మాట్లాడుతూ: ప్రతి రోజు యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రకరకాల రోగాలకు యోగాతో పరిష్కారం పొందావచ్చని తెలిపారు.యోగా వల్ల జరిగే ప్రయోజనాలు వెన్ను లేదా మెడ నొప్పి, నిద్ర సమస్యలు, తలనొప్పి, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఏకాగ్రత అసమర్థతతో సహా అనేక విధాలుగా ఒత్తిడి బహిర్గతమవు తుందని తెలిపారు. అదేవిధంగా యోగలో భాగంగా ఆదివారం చోక్కయ్య గుట్ట పై గిరి ప్రదక్షణ చేయడం జరిగింది. అందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్రి, పిట్ల బాపురావ్, మల్లిక గంగాధర్, గుండయ్య శ్రీనివాస్,బోదిరే గంగా మోహన్,అసిస్ రాయ్, తిరుపతి, ఫణీంద్ర, సుమన్ , శ్యామ్ ,శ్రీనివాస్, శంకర్, బుచ్చయ్య యోగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**వెల్దండ,నవంబర్ 23,మన సాక్షి:**



కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి అలీ అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులను మాజీ జెడ్పిటిసి వావిళ్ళ వెంకటమ్మ ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి మురికి నీరు పోవడానికి కాలువల సరిగ్గా లేక అవస్థలు పడుతూ కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అండర్ డ్రైనేజీకి రూ.5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని మాజీ ఉపసర్పంచ్ అలీ తెలిపారు. అలాగే లింగారెడ్డి పల్లి నుండి జూపల్లి రోడ్డుకు రూ.3 లక్షల 60 వేల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆలీ, కాడురామ్ నాయక్, షాబుద్దీన్, ప్రదీప్, కొప్పు రాణి, జోగు లింగమయ్య, రత్నమయ్య, నందయ్య, రాజేష్, అల్లాజి ,శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

**ధర్మారం, నవంబర్,23,మన సాక్షి:**



ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామంలో కే పి ఆర్, కరీంనగర్ హాస్పటల్ కొలుముల దామోదర్ యాదవ్ ఎన్నారై కెనడా సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా,ఇట్టి శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మార్కెట్ కమిటీ చైర్మన్ రుప్ల నాయక్ ప్రారంభోత్సవాన్ని, వైస్ చైర్మన్ ఆరిగే లింగయ్య,మాజీ సర్పంచ్ పాలమాకుల మాధవరెడ్డి,ఇంచార్జ్ వేల్పుల నాగరాజు,తో కాలసి రిబ్బన్ కట్ చేసిన ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రుప్ల నాయక్,ఉచిత వైద్య శిబిరంలో చామనపల్లి గ్రామం తో పాటు ఇతర గ్రామాల నుండి 500 పై చిలుక పేషెంట్లు రాగ డాక్టర్ వంశీధర్ రెడ్డి,ఎమ్మెస్ ఆర్థో, డాక్టర్ గీతారెడ్డి, ఎమ్మెస్,ఆధ్వర్యంలో డాక్టర్ల బృందంతో ఓపి చుయించుకోగా వచ్చిన పేషెంట్లకు మెడిసిన్ ఇవ్వడం జరిగింది,వైద్య శిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ వంశీధర్ రెడ్డి డాక్టర్ గీత రెడ్డి కి,కోలుముల దామోదర్ యాదవ్ ఎన్నారైకి కృతజ్ఞతలు తెలియజేసిన, వేల్పుల నాగరాజు,కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ రుప్ల నాయక్,వైస్ చైర్మన్ అరిగే లింగయ్య,మాజీ సర్పంచ్ పాలమాకుల మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పుల రేవతి నాగరాజు,వేంకట్ రెడ్డి,కొమ్మ లచ్చయ్య,వేల్పుల రమేష్,ఆవుల సాయి,కుమార్, సంపత్, పనస సాగర్,బేధగం అంజి,మారం సాగర్, అనంతల శ్రీధర్,గౌడ నర్సింగం, పాలమాకుల సందీప్ రెడ్డి, గొల్లపల్లి రాజు,యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## నీటి సరఫరా బంద్

**నారాయణపేట టౌన్, నవంబర్ 23 మన సాక్షి :**

సోమవార సాయంత్రం 6:00 గంటల నుండి 2025 నవంబర్ 25 మంగళవారంసాయంత్రం 6:00 గంటల వరకు 24 గంటలు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని కార్యనిర్వహక అభియాంత మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ మహబూబ్నగర్ అధికారి డి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా క్రిస్టియన్ పల్లీ , మహబూబ్నగర్ దగ్గర 1200ఎంఎం పైపులైన్ మార్చుతున్నట్లు ఆయన తెలిపారు. ఇట్టి పని పూర్తి కావడానికి సుమారు 24 గంటల సమయం పడుతుందని, నీటి సరపరా 24 గంటలు ఆపివేయడం జరుగుతుందనీ అన్నారు. రాంరెడ్డి గూడెం నీటి శుద్ధికరణ ప్లాంట్ నుండి వెళ్ళే మహబూబ్నగర్ పురపలకకు పాక్షికంగా,మన్యంకొండ నీటి శుద్దకరణ ప్లాంట్ నుండి వెల్లె మహబూబ్నగర్, నారాయణపేట జిల్లాలోని 258 గ్రామాలకు , నారాయణపేట, మక్తల్ దేవరకద్ర పురపాలికలకు పూర్తి గా నీటి సరఫరాలో అంతరాయము ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలందరూ సహకరించగలరని ఆయన కోరారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన పేట క్రీడాకారిణులు

**నారాయణపేట టౌన్, నవంబర్ 23 మనసాక్షి :-**

అండర్-17 ఎస్ జి ఎఫ్ ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నారాయణపేట జిల్లా క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ చాటారు. నారాయణపేట జిల్లా నుండి మొత్తం 8 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొనగా వారిలో ముగ్గురు క్రీడాకారిణులు బాలమణి, ప్రియమణి, శివరంజని,తమ అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మరో ముగ్గురు క్రీడాకారిణులు నికిత, శిరీషా, మౌనిక ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాకు పేరు తెచ్చిన క్రీడాకారిణులను నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



**శేరిలింగంపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**

మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో సీనియర్ నాయకులు డీఎస్ఆర్ కె ప్రసాద్ ఆధ్వర్యంలో, మెడికవర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు మొవ్వా సత్యనారాయణ రఘునాథ్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, సీనియర్ నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ గైనకాలజీ, పిల్లల వైద్యం, ఆర్థోచర్మ, నేత్ర, ఈ ఎన్ టి, న్యూరాలజీ వంటి విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందులు కూడా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ శిబిరంలో 18 రకాల రక్త పరీక్షలు, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో పరీక్షలు, ఈసిజి , ఈ ఎన్ టి , దంత, నేత్ర పరీక్షలు, ఎక్స్రే, అర్హులైన వారికి ఉచిత కళ్లజోడులు, మందులు వంటి సేవలను ఒకేచోట అందించడం ఎంతో మంచి కార్యక్రమమని గాంధీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను, పాస్టర్లను ఎమ్మెల్యే గాంధీ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

**కోటగిరి, నవంబర్ 23,మన సాక్షి:**

పోతంగల్ మండలం లోని పిఎస్ ఆర్ నగర్ గ్రామం లో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి,తెలంగాణ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో ఆదివారం స్థల పరిశీలన చేశారు.స్కూల్ నిర్మాణానికి రూ 200 కోట్లు, చెక్ పోస్ట్ నుంచి హున్స వరకు 11 కిలోమీటర్ల రోడ్డును డబుల్ రోడ్డు గా నిర్మించడాని కి రూ. 30 కోట్లు మంజురయ్యాయని పేర్కొన్నారు. సోమవారం వీటికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులకు అవసరమయ్యే అన్ని వసతులతో కూడిన పాఠశాల భవన నిర్మాణం ఇక్కడ చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. రూ. 30 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హన్మంత్, మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్, మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, కాంగ్రెస్ నాయకులు, కొట్టం మనోహర్, ఎజాజ్ ఖాన్,కేశ వీరేశం,పత్తి లక్ష్మణ్, గంట్ల విట్టల్, షాహిద్, హంగర్గా గంగాధర్, మానిక్ అప్ప,బర్ల మధు, షాజీ,జుబేర్, పోచిరాం, మాధవరావు పటేల్, రాంబాబు, జగన్, ధన్ రాజ్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పనుల్లో మహిళలదే పై చేయి..!

**మహిళలు పలుగు పారపట్టి ఉపాధి హామీ బాట**

**పురుషులకంటే 27 వేల మంది అధికం మహిళలే**



**తుంగతుర్తి,నవంబర్ 22, మన సాక్షి:**

తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలతో పాటు సూర్యాపేట జిల్లా స్థాయిలో మహిళలు తాము ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారు అవకాశాలను ఆదిపుచ్చుకొని రాణిస్తున్నారు.ఇంటిని చక్కదిద్దడమే కాకుండా కుటుంబ పోషణ కావాల్సిన ఆర్థిక సహకారాన్ని తమ వంతుగా అందిస్తున్నారు పురుషులతో సమానంగా ఉద్యోగాల్లోనే కాకుండా వ్యవసాయం కూలి పనులలోను చెమటోడ్చి కష్టపడుతున్న ఉపాధి హామీ పనుల్లోనూ ఆరా గడపట్టి పనులు చేస్తున్నారు ఒకప్పుడు ఊరు వదిలి పట్టణాలకు వెళ్లికూరి పనులు చేసుకునేవారు.

ఇప్పుడు ఉన్న ఊరిలోనే కూలీ పనులు చేసుకుంటున్నారు జిల్లాలో 2025 26 ఆర్థిక సంవత్సరంలో పురుషులకంటే మహిళలు ఎక్కువ పని దినాలను వినియోగించుకొని శభాష్ అనిపించుకుంటున్నారు.ఈ ఏడాదిలో ఇప్పటివరకు పనులకు వెళ్తున్న వారిలో పురుషుల కంటే మహిళలు సంఖ్య అధికంగా ఉంది ఒక్కో మహిళ సరాసరి నిత్యం 260 నుండి 280 వరకు సంపాదిస్తున్నారు.మహిళలు నెలలో 20 రోజులపాటు పనులకు వెళ్తున్నారు ఈ డబ్బులతో వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారు.

జిల్లాలో 486 పంచాయతీల్లో ఉపాధి పనులు అతిబల జోరు కనిపిస్తుంది కానీ ప్రదేశాలలో వీరే అధికంగా ఉంటున్నారు హాజరు సమయానికి పనికి రావడం పని పూర్తి తర్వాతనే వెళ్లడం వంటి నిబంధనలు మహిళలు అధికంగా పాటిస్తున్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తున్నారు ఉపాధి హామీ పథకం నిబంధన ప్రకారం ఒక ఏడాదిలో ఒక కుటుంబానికి వంద రోజులు మాత్రమే పనులు ఉంటాయి 100 రోజుల పని పూర్తి తర్వాత మళ్లీ వచ్చే ఎడాది వార్షిక సంవత్సరం ప్రారంభం వరకు నిరీక్షించాల్సి ఉంటుంది ఇప్పుడు కూడా జిల్లాలో సుమారు 56 కుటుంబాలు వందరోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాయి.

వీరు మళ్లీ ఉపాధి పనులకు వెళ్లాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఆగాల్సిందే ఇలా క్రమం తప్పకుండా పనులకు వచ్చే మహిళలకు త్వరగా ఉపాధి పని దినాలు అయిపోతున్నాయి ఇలాంటి వారిని 150 రోజుల పని దినాలుగా ఇవ్వాలని డిమాండ్ గతం నుంచి ఉంది.

**జాబ్ కార్డులు..పరిశీలిస్తే..:**

ఉపాధి హామీ పథకం ప్రారంభించిన కొత్తలో పురుషులే కూలీ పనులు కు వెళ్లేవారు తర్వాత రోజుల క్రమంగా మహిళలు ఆసక్తి చూపించారు ఇప్పుడు ఎక్కువ పని దినాలను వినియోగించుకోవడంలో అతిబలే ముందుంజలో ఉన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా 25 నుండి 26 వరకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పదిమందినాల్లో పురుషులకంటే ఎక్కువగా మహిళలే వినియోగించుకుంటున్నారు.జిల్లాలో మొత్తం 2.63 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి వీటిలో ఐదు పాయింట్ ఏడు లక్షల కూలీలు ఉన్నారు ఇందులో ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3.33 లక్షల మంది కూలీపరుడు చేశారు ఇందులో మహిళలు 1. 80 లక్షల మంది పురుషులు ఒకటి పాయింట్ 53 లక్షల మంది ఉన్నారు పురుషుల కంటే ఎక్కువగా మహిళలు పడింది నాలు చేసి మేము ఎందులోనూ తక్కువ కాదని నిరూపించుకున్నారు.

**బాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి:**
**– ఇన్చార్జి ఆర్డీవో శిరీష...**

ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి 2025 నుండి 26 లో ఇప్పటి వరకు కురిసిన కంటే మహిళలు ఎక్కువగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు ఇంకా ఎవరైనా ఉపాధి పని చేయాలనుకుంటే సంబంధిత క్షేత్ర నాయకులను సంప్రదించగలరని మా యొక్క మనవి.

**ఉపాధి పథకం వివరాలు:**

జాబ్ కార్డులు 2.63 లక్షలు మొత్తం కూలీలు 3.33 433

**పనులు వినియోగించుకున్న:**

మహిళలు 1. 80.2 35. పురుషులు1.53.198. పూర్తయిన పని దినాలు.29.58. లక్షలు. మహిళలు చేసినవి.18.10. లక్షలు. పురుషుల పని దినాలు 11.48. లక్షలు.

## కార్యకర్త వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**గోధవరిఖని,నవంబర్ 23,మన సాక్షి:**



రామగుండం నియోజక వర్గంలోని కార్పొరేషన్ పరిధిలో కెసిఆర్ కాలనీకి చెందిన గారె పల్లి సంతోష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో( పక్షవాతం) బాధపడుతున్నారు. వైద్య చికిత్స కూడా డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని విషయం తెలిసిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు వ్యల్ల హరీష్ రెడ్డి ఆదివారం వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి భరోసాగా పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని ఎలాంటి ఆపద వచ్చిన విహెచ్ ఆర్ ఫౌండేషన్ ద్వారా భరోసాగా నిలుస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉండి పనిచేస్తానని రాబోయే ఎన్నికలు ఏవి వచ్చిన కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుముల కళావతి, పర్శ స్వాతి, అల్లి గణేష్, బూరుగు వంశీకృష్ణ, కొండా సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జయంతి వేడుకలు



**గోదావరిఖని,నవంబర్ 23,మన సాక్షి:**

భగవాన్ సత్య సాయి శత జయంతి సందర్భంగా ఆదివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

**గోదావరిఖని,నవంబర్ 23,మన సాక్షి:**



మున్సిపల్ సేవలకు సంబందించి తమ సమస్యలు పరిష్కరిం చుకోవ డానికి నగర ప్రజలు కాల్ సెంటర్ , ఆన్ లైన్ సదుపాయాలను ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య%శీ% , రోడ్లు , కాలువల సమస్యలు , నీటి సరఫరా ,వీధి దీపాలు వెలగకపోవడం , తదితర అన్ని మున్సిపల్ సేవలకు సంబందించి ప్రజలు కార్యాలయానికి వచ్చి ధరఖాస్తు సమర్పించవలసిన అవసరం లేకుండా కాల్ సెంటర్ , ఆన్ లైన్ లో తమ ఫిర్యాదులను నమోదు చేయడంతో పాటు పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే సౌలభ్యం ఉందని అన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారు ప్లే స్టోర్ నుండి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ "సిటిజెన్ బడ్డీ యాప్ " డౌన్ లోడ్ చేసుకొని అందులో ఫిర్యాదు నమోదు చేయవచ్చని అలాగే వెబ్ సైట్ %ష్ట్రజూజూ:// వస్త్రశీజఱఅఎఱఖ.ఱఅ% లోని గ్రీవెన్స్ పేజీ లో కూడా తమ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 14420 కు ఫోన్ చేయడం ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేసుకునే సౌలభ్యం ఉన్నదని, అంతేకాకుండా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లోని కాల్ సెంటర్ కు నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 18004257062, 1800 4258 927 లకు లేదా ఫోన్ నెం . 960 3666444 , 9392483959 ( కంట్రోల్ రూమ్ ) లకు కు ఫోన్ చేస్తే ఫిర్యాదు స్వీకరించి నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.కావున ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన మున్సిపల్ సేవలను పొందాలని అమె కోరారు.

## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి





**శేరిలింగంపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృ శ్రీ నగర్ కాలనీలో ఉన్న బిష్మ డాక్టర్ అకాడమీ నిర్వహించిన నీట్ లాంగ్ టర్మ్ సక్సెస్ మీట్‌లోఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, బిష్మ డాక్టర్ అకాడమీ సక్సెస్ మీట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రతి విద్యార్థి ఆశయాన్ని నెరవేర్చే విధంగా విద్యను అందించడం బిష్మ అకాడమీ ప్రధాన లక్ష్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నీట్‌లో మంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగిమంచి డాక్టర్లుగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలని గాంధీ సూచించారు. తల్లిదండ్రులకు, సంస్కృతిక వాతావరణానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ మంత్రుల వాట్సప్ గ్రూప్ హ్యాక్..!

**మన సాక్షి ,నవంబర్ 23,తెలంగాణ బ్యూరో :**




సైబర్ క్రైమ్ నేరాల ఆగడాల రోజురోజుకు పెరుగుతున్నాయి. తెలంగాణలోని పలువురు మంత్రుల వాట్సప్ మీడియా గ్రూపులు హ్యాక్ అయ్యాయి. ఎస్బిఐ కేవైసీ పేరుతో ఏపీకే ఫైల్స్ ను సైబర్ నేరగాళ్లు షేర్ చేసి హ్యాక్ చేశారు. సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలతో ముందుకు వస్తున్నారు. ఏపీకే ఫైల్స్ షేర్ చేసి వాట్సాప్ గ్రూపులు సైతం హాక్ చేసి ఎకౌంట్లు ఖాళీ చేస్తున్నారు. తెలంగాణ మంత్రులకు సంబంధించిన మీడియా వాట్సాప్ గ్రూపులను ఎస్బిఐ కేవైసీ పేరుతో షేర్ చేసి హ్యాక్ చేశారు. ఈ సంఘటనపై సైబర్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. హ్యాక్ అయిన వాట్సాప్ గ్రూపులను సురక్షితంగా ఉంచారు. హ్యాకర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కంగ్టి లో వార్డుల రిజర్వేషన్లు ఇవే

**కంగ్టి, నవంబర్ 23, మన సాక్షి :-**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపిడివో సత్తయ్య ఎంపీపీ సమావేశం మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలకు సంబంధించి 280 వార్డ్ సభ్యుల రిజర్వేషన్లు ఖరారు. ఎస్టి 49,మహిళలు19, జనరల్ 30, ఎస్సీ 51 మహిళలు 20, జనరల్ 31, బీసీ 53 , మహిళలు 20 , జనరల్ 33, అన్ రిజర్వుడ్ 127 , మహిళలు 60, జనరల్ 67 జిల్లా అధికారులు ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో లాటరీ పద్ధతిన వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రక్రియ నిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిఓ లక్ష్మణ్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి, ప్రేమ, స్వచ్ఛమైన సేవలకు బాబా ప్రతిరూపం

**శేరిలింగంపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**



శాంతి, ప్రేమ, స్వచ్ఛమైన సేవలకు సత్యసాయిబాబా ప్రతిరూపం ఎమ్మెల్యే గాంధీ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా నారాయణ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సత్యసాయి బాబా శాంతి, ప్రేమ, స్వచ్ఛమైన సేవలకు ప్రతిరూపమని, కులం, మతం, ప్రాంతం, దేశాలకు అతీతంగా ఆయన మానవత్వాన్ని చాటిచెప్పారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ప్రపంచమంతా ప్రేమను పంచారని, లక్షల మందిని సేవా మార్గంలో నడిపించారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.మావన రూపంలో మనం చూసిన దైవమే సత్యసాయి. ఆయన శత జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకోవడం అందరి అదృష్టం' అని అన్నారు. ప్రభుత్వాలు కూడా చేయలేని సేవలను సాయిబాబా వారి ట్రస్టు ద్వారా చేసి చూపించారు. ముఖ్యంగా ప్రతి వారూ చదువుకోవాలని ప్రభుత్వాలతో పోటీ పడి కేజీ టు పీజీ వరకు పేదలకు ఉచితంగా విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. విద్య, వైద్య, తాగునీటి సౌకర్యం కల్పించడంలో ఎంతో కృషి చేశారు. జీవితంలో చివరి దశలో మరణం తప్ప వేరే మార్గం లేదని అనుకున్న దశలో ఎంతో మందిని బతికించి దేవుడిగా కొలువబడుతున్నారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు మరియు నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, మాధవరం గోపాల్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారుఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు మరియు నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, మాధవరం గోపాల్ మరియు భక్తులు పాల్గొన్నారు

## వైసీపీ కార్యకర్త సోమునాథ్ గుండె పోటుతో మృతి

**రామసముద్రం,నవంబర్ 23, మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల గ్రామ పంచాయతీ సీతారాగానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త సోమనాథ్ గౌడ్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నిసార్ అహ్మద్ కార్యకర్తస్వగ్రామానికి వెళ్లి పార్థవదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మీ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మండల వైసీపీ కన్వీనర్ కేశవ రెడ్డి , వైసీపీ సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్,వైసీపీ స్టేట్ బిసి నాయకులు గెవన్న రెడ్డి,వీరే గౌడ్,విజయ్, ఆనంద్, కొమ్ము నారాయణస్వామి, కృష్ణప్ప, శివ, డాక్టర్ ప్రకాష్, సిపిఐ నాగప్ప, నాగార్జున,నరసింహులు, మల్లికార్జున్ రెడ్డి, చెన్నకేశవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పమ్మిలో ఇందిరమ్మ చీరల పంపిణీ



**ముదిగొండ,నవంబర్ 23,మన సాక్షి:**

మండల పరిధిలోని పమ్మి గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వడ్డే మాధవరావు, ఉపాధ్యక్షులు రాయబారపు మహేష్, పార్టీ సీనియర్ నాయకులు ఏలూరు హనుమంతరావు , సిహెచ్ శివ , గోపి ,శేఖర్ గ్రామ దీపికలు డ్వాక్రా మహిళలు, మొదలగురు తదితరులు పాల్గొనడం జరిగింది..

## ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ



**తుంగతుర్తి,నవంబర్ 23, మన సాక్షి:**

తుంగతుర్తి మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు హాజరై మండల సమైక్య సభ్యురాళ్లకు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పలువురు మంత్రుల సహకారంతో తుంగతుర్తి నియోజకవర్గం 18 నెలలలోనే 1800 కోట్ల రూపాయల నిధులను తేవడం జరిగిందన్నారు రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ రాజ్యంలో ఇందిరమ్మ రాజ్యం లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ అధిక మొత్తంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ ఉచిత బస్సు సౌకర్యం 500 రూపాయలకే గ్యాస్ నూతన రేషన్ కార్డులు మా నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళా సంఘాల ద్వారా ప్రతి సంఘానికి ప్రతి ఒక్క మహిళకు ఇందిర క్రాంతి చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు గుండ గాని జమున కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ గ్రామ శాఖ అధ్యక్షులు రాంబాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు జమున ఎన్ఎస్ఈఐ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు మండల సమీదాన్ అధ్యక్షులు అనిల్ పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో లబ్ది కోసమే చీరల పంపిణీ

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**భీంగల్, నవంబర్ 23,మన సాక్షి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కావస్తోంది. రెండు బతుకమ్మ పండుగలు కూడా పోయాయి. కానీ, ప్రభుత్వం ఏ ఒక్క బతుకమ్మ పండగకు చీరల పంపిణీ చేపట్టలేదు. రానున్న స్థానిక ఎన్నికల్లో లబ్ది పొందేందుకు, మోసపూరిత ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చీరలు పంపిణీ చేస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మీడియా కు ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. తెలంగాణలో స్థానిక ఎన్నికలు లేకపోతే చీరల పంపిణీ కాదు కదా.. ఓ జాకెట్ ముక్క కూడా ఇచ్చే వాడు కాదని ప్రశాంత్ ఎద్దేవా చేశారు. ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగికి వచ్చే ప్రతినెలా జీతం మాదిరిగా ప్రతినెలా ఒకటో తారీఖునే ప్రతి మహిళకు రూ. 2,500 వేయిస్తానన్న డబ్బులు ఎందుకివ్వడం లేదో ప్రశ్నించండని ప్రశాంత్ రెడ్డి మహిళలకు సూచించారు. చీరలు పంపిణీ చేయడం ఎలాగూ జరిగేదే కానీ, ప్రతినెలా మహిళలకిస్తామన్న రూ. 2500 లు పెన్షన్ రెండేళ్ల నుంచి వచ్చే రూ. 60 వేలు, పెన్షన్ తీసుకునే వారికి రూ. 2 016 ల నుండి రూ. 4016 లకు పెంచుతానని చెప్పిన పెన్షన్ ను రెండేళ్ల కు సంబంధించిన రూ. 48 వేలు కలిపి పెన్షన్ దారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేయాలని మహిళలను పెన్షన్ దారులను ప్రశాంత్ రెడ్డి కోరారు.



పీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేసే ఉద్దేశాలతోనే రాష్ట్రాన్ని పాలిస్తున్నాడే తప్ప ఇచ్చిన మాట మీద నిలబడాలనే ఆలోచన రేవంత్ రెడ్డిలో ఏ కోశానా లేదని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. చీరలు పంపిణీ చేయడానికి ఇంటికి వచ్చే నాయకులు, అధికారులను మహిళలు ప్రతినెలా 5. 2500 ల పెన్షన్ గురించి నిలదీయాలని సూచించారు. అలాగే రూ. 2వేల పెన్షన్ ను రూ. 4 వేలకు పెంచుతామన్న హామీపై నిలదీయాలని ప్రశాంత్ రెడ్డి కోరారు. చీరలు పంపిణీ చేస్తున్నవారి నుండి ఒక చేత్తో చీరను తీసుకుని మరో చేత్తో రెండేళ్ల నుంచి ప్రభుత్వం బాకీ పడ్డ పెన్షన్ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేయాలని మహిళలకు, పెన్షన్ దారులకు సూచించారు.

# దశరథ నాయుడుకు సింగల్ విండో పదవి

**రామసముద్రం,నవంబర్ 23,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని,పార్టీ అభ్యున్నతికి,అభివృద్ధికి శక్తివంచన లేకుండా నిస్వార్ధంగా సేవలు అందించిన దశరథ నాయుడు కష్టానికి ఫలితం దక్కిందని తెదేపా పార్లమెంట్ అధ్యక్షులు - నియోజకవర్గ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ఆదివారం సిద్ధవటం నందు పర్యటిస్తూ స్థానిక బెటాలియన్ కళ్యాణ మండపం నందు నూతన సింగల్ విండో చైర్మన్ అభినందన సభకు ఆయన కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ సూర్య నారాయణ రెడ్డి తో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ రైతుకు అన్ని సమయానికి అందే విధంగా కృషి చేస్తూ సొసైటీ అభివృద్ధికి దోహదపడాలని పాలకవర్గానికి ఆయన తెలియజేశారు. అదే విధంగా అంతకుముందు సొసైటీ చైర్మన్ దశరథ నాయుడు మాట్లాడుతూ తన చైర్మన్ ఎంపిక పట్ల కృషి చేసిన చమర్తికి ధన్యవాదాలు తెలియజేస్తూ, అంకితభావంతో పనిచేస్తానని, ఆయన తెలియజేశారు. అంతకు ముందు పర్యటనలో భాగంగా చమర్తి జగన్ మోహన్ రాజుకి నాయకులు భారీ ఎత్తున బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేవాలయ, పర్యావరణ పరిరక్షణకై పోరాటానికి సిద్ధం..!

**వేములపల్లి,నవంబర్ 24,మన సాక్షి:**



రోడ్డు పనుల పేరుతో దేవాలయ భూములను ధ్వంసం చేయడం నిలిపివేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలో శెట్టిపాలెం గ్రామ పంచాయతీ మీదగా వెళ్తున్న నాలుగు వరుసల రోడ్డు పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు బిజెపి అడ్డు కాదు అని, రోడ్డు పనులకు ప్రభుత్వ భూమి ఎంతో ఉన్నప్పటికీ కొండలను గుట్టలను స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయ పచ్చని పరిసరాలను ధ్వంసం చేయడం తగదన్నారు. అక్రమంగా చెట్లను రాళ్లను మట్టిని తరలించడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్మాణంలో ఉన్న దేవాలయ గుట్టను ధ్వంసం చేయడం పై మండి పడ్డారు. తక్షణమే అన్యాక్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని రోడ్డు పనులను కొనసాగించాలని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుంటే రోడ్డుని నిర్మాణం పేరుతో వందల సంవత్సరాల నాటి చెట్లను తొలగించడం, అమ్ముకోవడం, పచ్చని చెట్లకు నిప్పు పెట్టడం ఇది దేనికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రోడ్డు పనుల అక్రమాలపై దృష్టి సారించాలని లేనిపక్షంలో దేవాలయ, పర్యావరణ పరిరక్షణ కోసం బిజెపి నల్గొండ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. అనంతరం బిజెపి నాయకులు వేణుగోపాల స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి మండల అధ్యక్షులు పెదమాం భరత్, బిజెపి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంటు సైదులు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చల్లమల్ల సీతారాం రెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న , జిల్లా నాయకులు జానకి రామ్ రెడ్డి మండల పార్టీ ముఖ్య నాయకులు నిమ్మల జానారెడ్డి, పెదమాం ప్రసాద్, చక్కని ఉపేందర్, మాతంగి ప్రభాకర్, ఇరుగుదిండ్ల నరేష్, మల్లికంటి సైదయ్య, కేతనపల్లి భూపాల్ రెడ్డి, మొదల అశోక్, ఈట మహేష్, ఆలకుంట్ల మహేష్, సతీష్, రవి, వీరస్వామి, వెంకన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్య సాయి శతజయంతి వేడుకలు

**నల్లగొండ,నవంబర్ 23,మన సాక్షి:**



సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆదివారం స్థానిక రాఘవేంద్ర కాలనీలోని సత్యసాయి ఆలయంలో కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఫుట్పాత్ ల పై నిద్రిస్తున్న బీద వారికి దుప్పట్లు పంపిణీ చేయగా మధ్యాహ్నం దుప్పలపల్లి, పానగల్ లోని లెప్రసీ కాలనీ వాసులకు, చారుమతి ఆశ్రమ బాలికలకు నారాయణ సేవ ( అన్నదానం ) నిర్వహించారు. సాయంత్రం అత్యంత అందంగా అలంకరించబడిన శ్రీ సత్య సాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రం నందు కార్యక్రమములు నిర్వహించారు. వేద పఠనం తో కార్యక్రమము ప్రారంభించారు. తదుపరి భగవన్నామ సంకీర్తనలు ఆలపించారు. శ్రీ సత్య సాయి సమితి కన్వీనర్ పి విశ్వేశ్వర్ ఆహుతులకు స్వాగతం పలుకుతూ శ్రీ సత్య సాయి సేవా సమితి గురించి తెలియచేసి అందరూ స్వామి అశిష్యుల కోసం సమితి కార్యక్రమలో పాల్గొనాలని కోరారు తదుపరి జ్యోతి ప్రజ్వలన గావించారు. బాలవికాస విద్యార్థుల చే కోరారుబాబా శత జయంతి కేక్ ను కోసినారు . తరువాత డాక్టర్ శశిధర్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎకనామిక్స్ సహాయ ఆచార్యులు ( విశ్రాంత) ఆధ్యాత్మిక ప్రసంగం చేసినారు. తదుపరి బాలవికాస్ విద్యార్థుల చి సాంస్కృతిక కార్యక్రమముల తదుపరి మహా హారతి తో కార్యక్రమము ముగించారు భక్తులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా గుడిపాటి నర్సన్న..!

**తుంగతుర్తి,నవంబర్ 23,మన సాక్షి:**

తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగు పెల్లి గ్రామంలో బీద కుటుంబంలో పుట్టినగుడిపాటి మల్సూరు-ఎల్లమ్మ పుణ్య దంపతులకు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో 1971వ సంవత్సరంలో నర్సన్న జన్మించాడు. 1990 నుండి 95 వరకు సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి నక్సల్స్ గ్రూపులో అజ్ఞాతవాసంలో పనిచేసి మాజీ మంత్రివర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సూచనల మేరకు 1995 డిసెంబర్లో అప్పటి నల్గొండ జిల్లా ఎస్పీ రవిగుప్తా సమక్షంలో సరెండరై జనజీవన స్రవంతిలో కలిశారు. 2001 నుండి 2006 వరకు తుంగతుర్తి జడ్పిటిసిగా పనిచేయడం జరిగింది. 2006 నుండి 2008వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2009 సంవత్సరంలో మొదటిసారి తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2014వ సంవత్సరంలో 2వసారి తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటించింది. తర్వాత కాంగ్రెస్ పార్టీ జేఏసీకి ఒప్పందం ప్రకారంగా తనకు ఇచ్చిన టికెట్ ను రద్దు చేసి జేఏసీ అభ్యర్థికి బీఫామ్ ఇవ్వడం జరిగింది. తదుపరి నర్సన్నకు ఏఐసీసీ నుండి కొప్పుల రాజు,నేటి రాష్ట్రమంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అట్టి హామీని నెరవేర్చలేదు. 2012 నుండి 2019 వరకు తన సహచరి గుడిపాటి వెంకటరమణని తుంగతుర్తి రైతు సేవ సహకార సంఘం చైర్మన్ గా పదవి ఇవ్వడం జరిగింది. అప్పటినుండి 2019 వరకు తన సహచరి వెంకటరమణ డిసిసిబి,డీసీఎంఎస్ డైరెక్టర్గా పనిచేశారు.



2014 నుండి 2018 వరకు నర్సన్న టీపీసీసీ సభ్యుడిగా మరియు 2009 నుండి 2023 వరకు తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా పనిచేయడం జరిగింది. మొక్కవోని దీక్షతో పనిచేసిన గుడిపాటి నర్సయ్యకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నేడు డీసీసీ అధ్యక్షునిగా నియమించడం పట్ల,పార్టీపై అభిమానం ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేకాట రాయుళ్లు అరెస్ట్..!

**మిర్యాలగూడ,నవంబర్ 23,మన సాక్షి:**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆరు మంది పేకాట రాయుళ్లను రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. గణేష్ నగర్ లోని ఒక ఇంటి వద్ద కొంతమంది పేకాట ఆడుచున్నారనే సమాచారం పై దాడి చేసి 6 గురుని పట్టుబడి చేసి వారి నుండి 3800 రూపాయల నగదు, ఒక కారు, ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్, ఆరు సెల్ ఫోన్లు, 104 ప్లేయింగ్ కార్డులు,గ్రౌండ్ న్యూస్ పేపర్ షీట్ ను స్వాధీనం పర్చుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట

**మిర్యాలగూడ, నవంబర్ 23, మన సాక్షి:**



పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట భూమి పూజలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ కీర్తినీ భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా వారి విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయం అన్నారు..సనాతన ధర్మం కోసం వారు చేసిన పోరాటం ప్రతిఒక్కరికి స్ఫూర్తి అని అన్నారు.. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత గుడిపాటి నవీన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, దేశిడి శేఖర్ రెడ్డి,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నకిరేకంటి భాస్కర్, ధర్మశాస్త్ర పీఠం స్వాములు మాధవ రాజు, విజయ్, వెంకటేష్, ఉదయ్, సందీప్, నాగేశ్వరరావు, శ్రీను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

# వడ్డీలేని రుణాలిచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

**జిల్లాలో మహిళా సంఘాల పేరిట 30 ఆర్ టీసీ బస్సులు**

**జిల్లాకు 3 లక్షల చేనేత చీరలు**

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహా**

**అందోలు, నవంబర్ 23, మన సాక్షి:**

రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి. దామోదర్ రాజనరసింహా అన్నారు. వేళ్లాలన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంగుపేట వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళల సాధికారికతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చిందని, ఇందిరా గాంధీ స్పూర్తితో మహిళలు అత్మసైర్థ్యంతో ముందకు వేళ్లాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దామోదర్ మహిళలనుద్దేశించి ప్రసంగించారు. మహిళల్లో అలోచన శక్తి పెరిగిందని, ఏదైనా సాధించగలుగతామన్న నమ్మకం అత్మవిశ్వాసం పెరిగేలా వారికి వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. ఇందిరా గాంధీ స్పూర్తితో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశామని, తిరిగి వైఎస్ఆర్ హాయాంలో పావలా వడ్డీ రుణాలను, 2013లో వడ్డీలేని రుణాలను అందించేందుకు శ్రీకారం చుట్టి అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. సకాలంలో రుణాలను చెల్లించిన వారికి ఈ వడ్డీ వర్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ డ్వాక్రా సంఘాల్లోని మహిళలు రుణాలను పొంది అర్థికంగా ఎదగారని ఆయన అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను పూర్తిగా విస్మరించిందన్నారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 30 ఆర్‌టీసీ బస్సులను నడుపుతున్నాయని, ఒక్కో ఆర్‌టీసీ బస్సుకు ప్రభుత్వం రూ. 30 లక్షల గ్రాంటును ఇస్తుందని, సంఘం తరపున కేవలం రూ. 6 లక్షలు మాత్రమేన న్నారు. విద్యార్థుల యూనిఫామ్‌ల ద్వారా రూ. 1. 80 కోట్ల ఆదాయం మహిళ సంఘాలకు వచ్చిందన్నారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన మహిళలకు మంత్రి చేతుల మీదుగా చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సంగమేశ్వర్, జిల్లా డీఆర్‌డీవో సూర్యరావు, ఆర్‌డీవో పాండు, మార్క్‌ఫే డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఐకేపీ డీపీఎం రమేష్ బాబు, తహశీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేష్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు ఎస్. సురేందర్‌గౌడ్, రంగ సురేష్, పి. ప్రవీణ్ కుమార్, డి. శంకర్, గొల్ల శరత్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్, రమేష్ జ్యోషి, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లు రాజిరెడ్డి, రమేష్ గౌడ్, మాజీ ఏ ఎంసీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, నాయకులు మల్లేశం, ధనుంజయ్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 46 వెనక్కి తీసుకోవాలి

**మిర్యాలగూడ, నవంబర్ 23,మన సాక్షి:**



పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామనడం బీసీలను మోసం చేయడమేనని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, బీసీ జేఏసీ నియోజకవర్గం అధ్యక్షులు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్ అన్నారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన 46 జీవో ప్రతులను మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో చించి నిరసన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త జాడి రాజు, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, వడ్డెర సంఘం నాయకులు వద్దిరాజ్ రాజ్ కుమార్, బంటు సైదులు ముదిరాజ్,నక్క యాదగిరి, దాసరి వంశీ, మండల నాగరాజు, బన్నీ రవిచందర్,దోనేటి నాగయ్య, నాగార్జున్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిదేవులపల్లి సర్పంచ్ రిజర్వేషన్లు..!

**అడవిదేవులపల్లి,నవంబర్ 23,మన సాక్షి:**




అడవిదేవులపల్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీ లకు సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు చేయబడ్డాయి. అడవిదేవులపల్లి సర్పంచ్ జనరల్,చాంప్ల తండా జనరల్ మహిళ,చిట్యాల జనరల్, గోన్య తండా జనరల్,జిలకర కుంట తండా జనరల్ మహిళ, బంగారికుంట తండా జనరల్, నల్లమిట్ట తండా జనరల్ మహిళ, బాల్నేపల్లి ఎస్టీ మహిళ, మొల్కచర్ల ఎస్టీ మహిళ, ముది మాణిక్యం ఎస్టీ జనరల్, నడిగడ్డ ఎస్టీ జనరల్,కొత్త నందికొండ ఎస్టి మహిళ,ఉల్సాయిపాలెం ఎస్టీ జనరల్ కేటగిరీలకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగింది.

# పరిశోధనల వైపు దృష్టి సారించాలి




**హయత్ నగర్ నవంబర్ 23 మన సాక్షి**

పరిశోధనల వైపు దృష్టి సారించాలని డిఆర్డిఓ శాస్త్రవేత్త పి. శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. హయత్ నగర్ పరిధిలోని సాయి నగర్ శ్రీ చైతన్య స్కూల్ లో ఆదివారం విద్యార్థులకు నాసా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టిసాదించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపర్చడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ఆర్ఐ వెంకట్ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రఘువంశీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనీ దేవి, డీన్ రఘుపతి, సి బ్యాచ్ ఇన్ చార్జి సోమయ్య, ఏవో ప్రమోద్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.